# ఆత్మ హంతకులంటే ఎవరు?

బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు



బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో....

# ఆత్మ హంతకులంటే ఎవరు?



రచన & ప్రచురణ : తటవర్తి రాఘవరావు

ప్రథమ ముద్రణ : జనవరి, 2025
కాపీలు : 2,000

వెల : రూ. 70/-

పుస్తకముల కొరకు

**తటవర్తి వీర రాఘవరావు**

తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర.

సెల్ : 9440309812

## తటవర్తి దంపతుల YouTube ఛానెల్ Subscribe చేసుకోవాలంటే

**a) Whatsapp group** లో మీకు పంపబడుతున్న **Youtube** లింక్ మీద నొక్కినప్పుడు **Tatavarthy Veera Raghava Rao** ఛానెల్ **open** అవుతుంది. **Open** అవ్వగానే **subscribe** కనిపిస్తుంది. దాని మీద నొక్కితే **subscribe** అవుతారు. ప్రక్కనే వున్న **bell button** నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే **www.tst.org.in/videos/** ఓపెన్ అయిన తరువాత **I** లో **Tatavarthy Veera Raghava Rao** పేరు మీద నొక్కండి. **II & III** లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ **Open** అవుతాయి. **Open** అవ్వగానే **subcribe** కనిపిస్తుంది. దాని మీద నొక్కితే **subscribe** అవుతారు. ప్రక్కనే వున్న **bell button** నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

## తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

**website address : www.tst.org.in**

**a)** తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు **Google Maps Location** తెలుసుకోవచ్చు.

**b)** తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు **PDF** రూపంలో కలవు. వాటిని ఉచితంగా **Download** చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

**c)** తటవర్తి దంపతుల సందేశాలు **Concept** వారీగా **YouTube Play lists** రూపంలో ఇవ్వడం జరిగింది.

**d)** తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

**e)** తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

**5.** భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

# ఆత్మహంతకులంటే ఎవరు?

యోగులందరిలో గొప్పవాడే యోగీశ్వరుడు. ఒక కృష్ణుడు, బుద్ధుడు, జీసెస్, మహమ్మద్, గురునానక్ లాంటి స్థాయికి చేరిన వారినే యోగీశ్వరుడు అంటారు. ధ్యానం చేసే వాడిని యోగిఅంటారు. పూర్ణ జ్ఞానం పొంది, పరాకాష్టకు ఎదిగిన వారిని యోగీశ్వరులు అంటారు. అలాంటి వారు చెప్పే ప్రతి మాట ఆదర్శవంతమైనవి, ఆలోచించ వలసినవి,ఆచరించవలసినవి.

అలాంటి వారు చెప్పిన సందేశం ఊరికే వదిలేస్తే నష్టపోయేది మనమే. చాలామంది చదువుతారు, కాని చదివి వదిలేయడం వల్ల ఏ ప్రయోజనం ఉండదు. అందుచేత చెప్పిందానిని, చదివిన దానిని అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకున్నప్పుడే ఆచరించ గలుగుతారు, ఆచరించినప్పుడే ఫలితం పొందగలుగుతారు.

ఒక యోగీశ్వరుడు ఏం చెప్పాడంటే?

**"ఆత్మను నిర్లక్ష్యం చేసినవారు, 'ఆత్మ హంతకులు' అవుతారు"** అన్నాడు.

దీని గురించి కొంచెం వివరంగా తెలుసుకుందాం.

హత్య, ఆత్మహత్య, ఆత్మహంతకుడు అనే పదాలు చూడటానికి ఒకేలా వున్నా అర్థంలో కొంచెం తేడా వుంది. అవి తెలుసుకుందాం.

'హత్య' అంటే ఇతరుల శరీరంలో ఆత్మ వుండటానికి వీలు లేకుండా వారి శరీరాన్ని ఎవరైనా నాశనం చేస్తే దానిని హత్య అంటారు. ఉదాహరణకు కత్తితో పొడవడం, తుపాకీతో కాల్చడం లాంటివి.

'ఆత్మహత్య' అంటే ఎవరైనా తనకు తాను ఆత్మను శరీరంలో వుండడానికి వీలు లేకుండా శరీరాన్ని నాశనం చేసుకుంటే దాన్ని ఆత్మహత్య అంటారు.

ఉదాహరణకు ఊరేసుకోవడం కానీ, మంటల్లో దూకడం కానీ, ఏ వంతెన మీదనుంచో నదిలో దూకడం కానీ, రైలు క్రింద పడడం కాని చేస్తే ఆ శరీరంలో ఆత్మ వుండలేదు, శరీరం నుంచి బయటకు వచ్చేస్తుంది. అలాంటి పని చేసిన వారిని ఆత్మహత్య చేసుకున్నాడు అంటారు.

ఆత్మ హంతకుడు అంటే ఆత్మను శరీరంలో లేకుండా చేసినవాడు కాదు. ఎవరైతే జీవితకాలం జీవించినా కూడా తమ జీవితంలో ఆత్మను ఏ మాత్రం పట్టించుకోనివారు, ఆత్మకోసం, ఆత్మలాభం కోసం ఏమీ చేయకుండా ఆత్మను నిర్లక్ష్యం చేసిన వారిని "ఆత్మ హంతకులు" అంటారు.

ముందుగా ఇక్కడ కొన్ని విషయాలు తెలుసుకోవాలి. ముఖ్యంగా మనమంతా శరీరాలం కాదు, మనమంతా ఆత్మలం. ఆత్మలమైన మనం పై లోకాల నుంచి భూమి మీదకు వచ్చేటప్పుడు అక్కడ ఒక ప్రణాళిక వేసుకొని వస్తాం. ఎందుచేతనంటే పైలోకాల్లో ఉండేది ఆత్మ ఒక్కటే! ఆత్మ ఇంకా ఉన్నత లోకాలు చేరుకోవడానికి, ఇంకా గొప్పగా ఎదగడానికి చేయవలసింది ధ్యానం, పొందవలసింది జ్ఞానం. ఈ రెండూ భూమి మీద శరీరంతో సాధించాలి, అందుచేత భూమి మీద శరీరం తీసుకునేటప్పుడు ఆ శరీరంతో ధ్యానం చేసి, జ్ఞానం సంపాదించుకోవాలని ఆత్మ ప్రణాళిక వేసుకుంటుంది.

అలా ప్రణాళిక ప్రకారం భూమ్మీదకు వచ్చిన ఆత్మ అయిన మనం ఒక తల్లి గర్భంలో తయారయ్యే శిశువులో ప్రవేశిస్తాం. మెల్లిగా తొమ్మిది మాసాలు నిండిన తర్వాత తల్లి గర్భంలో నుంచి బయటకి వస్తాం. అంటే జన్మ తీసుకుంటాం. అలా జన్మ తీసుకునేదాకా మన ప్రణాళిక మనకు గుర్తుంటుంది. కానీ తర్వాత కుటుంబ ప్రభావం, పరిసరాల ప్రభావం, సమాజ ప్రభావం మన మీద పడుతుంది.

నేను ఆత్మ అన్న సంగతి మర్చిపోతాం. తల్లి గర్భంలో ఏ శరీరం అయితే తయారవుతుందో ఆ శరీరమే నేను అనుకుంటాం. ఆ శరీరంలో

ప్రవేశించింది నేను అన్నది మర్చిపోతాం. ఎందుచేతనంటే శరీరాన్ని తల్లి తయారు చేసింది, శరీరంలో వున్న మనం పై లోకాలనుంచి వచ్చాం.

విచిత్రం ఏమిటంటే? మనం అక్కడ ఏమి నిర్ణయించుకున్నామో, ఏమి చేయాలనుకున్నామో అన్నీ మర్చిపోతాం. మర్చిపోయి పరిస్థితుల ప్రభావానికి లోనైపోతాం. మనం ఏ కుటుంబంలో పుడతామో ఆ కుటుంబం నాది, ఏ కులంలో పుడతారో ఆ కులం నాది, ఏ మతంలో పుడతారో ఆ మతం నాది అనుకుంటాం. అలా ఏడు ఎనిమిది సంవత్సరాలు తల్లిదండ్రుల ప్రభావం మన మీద ఎక్కువగా వుంటుంది. వారు ఎలా చెబితే అలా చేస్తాం, ఎలా వుండమంటే అలా వుంటాం, వారు చెప్పినట్టే తయారవుతాం. తర్వాత సమాజంలోకి వెళ్తాం.

అలా ఎవరికైనా సమాజంలో డబ్బుకు ఎక్కువ విలువ ఉంటుంది. డబ్బు వున్న వాడిని గొప్పగా భావిస్తారు, వాడికి గౌరవం ఇస్తారు. ఎంత ఎక్కువ డబ్బు ఉంటే వాడు అంత గొప్పవాడుగా భావిస్తారు. డబ్బు లేని వాడిని పూచిక పుల్లలా, విలువ లేకుండా చూస్తారు.

అందుచేత ఎంత డబ్బు సంపాదిస్తే వాడికి అంత విలువ అనే భావంతో డబ్బు సంపాదించడానికి జీవితం అంతా వెచ్చిస్తారు. అలాగే బాగా డబ్బు సంపాదించిన వారు పదవులకి, అధికారానికి ఎక్కువ విలువిస్తారు. ఎవరు అధికారంలో ఉంటే వాడికి అంత గౌరవమూ, అంత విలువ ఉంటుందని భావిస్తారు.

ఇంకా కొంతమంది పెద్ద పెద్ద పోస్టులు, ఐఏఎస్ లు, ఐపీఎస్‌లు లాంటి పెద్ద పెద్ద ఉద్యోగాలు సంపాదించడం కోసం ప్రయత్నిస్తారు. ఇంకా కొంతమంది సినీ రంగంలో కానీ, లేకపోతే వ్యాపార రంగంలో కానీ, ముకేష్ అంబానీలాగ, లేకపోతే ఆటల్లో కానీ గొప్ప స్థాయికి ఎదిగితే వాడికి గౌరవం అనుకుంటారు.

అలాంటి స్థితి సంపాదించాలని చూస్తారు. ఆ గౌరవం భూమ్మీద

కలిగినప్పుడు నేను చాలా అదృష్టవంతుడిని అని పొంగిపోతూ వుంటారు. కానీ విచిత్రం ఏంటంటే ఎంత గొప్పవాడిగా భూమ్మీద ఎదిగినా, ఎన్ని గొప్ప పనులు చేసినా, కోటాను కోట్లు డబ్బు సంపాదించినా, శరీరం వదలగానే ఒక్కటీ కూడా రాదు. అన్నీ ఇక్కడే వదిలిపెట్టేస్తారు.

ఏవైతే చాలా గొప్పవి అనుకున్నారో, వేటికోసం జీవితమంతా వెచ్చించారో, శ్రమపడ్డారో, రాత్రీ పగలు కష్టపడ్డారో అవన్నీ చనిపోయిన తర్వాత వదిలేస్తారు. ఆత్మ అయిన తాను ఒక్కడే పైకి వెళ్తాడు. అలా చనిపోయిన వెంటనే తాను ఆత్మ అని స్పష్టంగా ఎవరికైనా తెలుస్తుంది. మామూలుగా గురువులు నువ్వు దేహం కాదు, నువ్వు ఆత్మవు అని చెబితే వింటారు కానీ, దేహమే నేను అన్నట్టుగా జీవిస్తారు దీనికి ముఖ్య కారణం వారు తెలుసుకున్నారు కానీ అర్థం కాలేదు.

ఇది ఎప్పుడు పూర్తిగా అర్థం అవుతుంది అంటే చనిపోయిన తర్వాత ఉండేది ఆత్మే కాబట్టి అప్పుడు నేను ఆత్మ అన్నది అర్థమవుతుంది. అంతేకాదు వారు జీవితమంతా రాత్రి పగలు కష్టపడి సంపాదించినవన్నీ భూమి మీదే వదిలి వేయాల్సి వస్తుంది. అప్పుడు ఎంతో బాధపడిపోతారు అరే 70 ఏళ్ళు 80 ఏళ్ళు పడిన కష్టం అంతా వృధా అయిపోయిందే ఎంత సంపాదించినా, ఎన్ని సంపాదించినా అన్ని వదిలి వేయవలసి వచ్చిందే అని ఎంతో బాధపడతారు. ఎంత నష్టపోయాను అని బాధపడినా చేసేది ఏముంది?

ప్రతి ఒక్కరికి చనిపోయాక తెలుస్తుంది. అరే ఇవన్నీ సంపాదించ డానికి ఎన్ని తప్పులు చేశాను, ఎన్ని పాపాలు చేశాను, ఎంతమందిని మోసగించాను, కానీ ఒక్కటీ నా కూడా రాలేదే! అంతేకాదు ఎవరికోసం ఈ పనులన్నీ చేశానో వారెవరు నా కూడా రావట్లేదు అని తెలుస్తుంది. విచిత్రం ఏమిటంటే వాడు చేసిన పాపాలే కూడా వస్తాయి.

అంతేకాదు అప్పటి దాకా కాలిపోయిన ఆ దేహమే నేను అని

అనుకున్నాడు, కానీ అది నేను కాదన్నమాట, నేను ఆత్మను అన్నమాట అని తెలుస్తుంది. అప్పుడు అనుకుంటాడు అరే! ఈ విషయం భూమి మీద ఉన్నప్పుడే తెలిస్తే ఎంత బాగుండును అని అనుకుంటాడు. ఇలా ప్రతి ఒక్కరిలో చనిపోయిన తర్వాత ఈ రకమైనటువంటి మధనం జరుగుతూ వుంటుంది.

ఎందుచేతనంటే శరీరం ఉన్నప్పుడు అంటే జీవించి వున్నప్పుడు తెలీదా అంటే సద్గురువు వల్ల కొంతమందికి తెలుస్తుంది. సద్గురువు నువ్వు దేహం కాదు ఆత్మవు అన్న సంగతి చెబుతాడు. కొంతమంది పుస్తకాల్లో చదువుతారు, ఉపన్యాసాల ద్వారా వింటారు, కానీ దేహమే నేను అన్నట్టుగా జీవిస్తారు.

అందుకే నేను మొదటి నుంచి చెప్తున్నాను, తెలుసుకోవడం వేరు, ఆచరించడం వేరు అని. ఎందుచేతనంటే తెలుసుకున్నవాడు చెప్తాడు, చెప్పింది అర్థం చేసుకున్నవాడు ఆచరించి లాభం పొందుతాడు. అందుచేత తెలుసుకోవడం గొప్ప కాదు, ఆచరించిన వాడే గొప్పవాడని తెలుసుకోండి.

అందుచేత ఎవరైతే తాను ఆత్మై ఉండి, ఆత్మ లాభానికి కాకుండా దేహ లాభం కోసం జీవితమంతా కృషి చేస్తారో వారే **'ఆత్మ హంతకులు'** అని ఒక యోగేశ్వరుడు చెప్పడం జరిగింది.

అటువంటి ఆత్మ శరీరంలో వున్నా ఒకటే! లేకపోయినా ఒకటే! వున్నా లేనట్టే!

ఎందుచేతనంటే? తాను శరీరంలో ప్రవేశించాడు కాబట్టి, ఆ శరీరానికి కొన్ని అవసరాలు ఉంటాయి, అవి తప్పనిసరి అవసరాలు. అవసరాలు తీరకపోతే శరీరం భూమ్మీద ఉండలేదు, అందుచేత వాటి కోసం ప్రయత్నించడం, సంపాదించడం, కృషి చేయడం తప్పనిసరి.

అందుచేత అవసరాలకు పరిమితమై, తర్వాత వున్న సమయం

అంతా ఆత్మ కోసం, ఆత్మ లాభం కోసం, ఆత్మ ఉన్నతి కోసం కృషి చేయాలి. అటువంటి వాడు జన్మను సద్వినియోగం చేసుకున్న వాడు అవుతాడు. విచిత్రం ఏమిటంటే ఈ డబ్బు వ్యామోహం వల్ల సంపాదించే కొద్దీ ఇంకా సంపా దించాలని వుంటుంది, ఎంత సంపాదిస్తున్నా ఇంకా ఇంకా సంపాదించాలనే వుంటుంది. తనకు సరిపడా ఉన్నా ఇంకా సంపాదిస్తూనే వుంటాడు.

ఎందుకు అంటే? నా పిల్లలు అంటాడు, వాళ్ళకి కూడా సరిపడా సంపాదించినా ఇంకా సంపాదిస్తూనే ఉంటారు, ఎందుకు అంటే? మనవలు అంటాడు. అలా ధనం విషయంలో ఎవరికీ లిమిట్ ఉండదు, అలా సంపాదిస్తూనే ఉంటారు. ఉదాహరణకు ముకేష్ అంబానీని చూడండి, ఎన్ని లక్షలకోట్లు వున్నా అలా సంపాదిస్తూనే ఉంటాడు.

కాని ఒక్క విషయం అర్థం చేసుకొండి, మీరు ఆత్మ అయినప్పుడు అవసరానికి మించి ఎంత సంపాదించినా అది అంతా వృధా అన్నది అవగాహన చేసుకోవాలి. ఎందుకు అంటే ఇప్పుడు ఎంత చెప్పినా అర్థం కాదు, కాని ఎప్పుడు అర్థమవుతుంది అంటే శరీరం వదిలాక అంటే చనిపోయాక అర్థమవుతుంది.

ఎందుచేతనంటే జీవితమంతా భూమి మీద వుండి సంపాదించిన కోట్లన్నీ కూడా భూమి మీదే వదిలి పెట్టి, ఆత్మ అయిన తాను పై లోకాలకు వెళ్లేటప్పుడు బాగా స్పష్టంగా అర్థమవుతుంది.

అప్పుడు బాధపడతాడు నా జీవితాన్ని ఎంత వృధా చేశాను? నా సమయాన్ని ఎంత నష్టపోయాను, నా శక్తిని, నా వాక్కును, నా బుద్ధిని, నా తెలివిని అన్నిటినీ నష్టపోయానని ఎంత బాధపడినా ఉపయోగం వుండదు. ఇంకా ఏమనుకుంటాడంటే? జీవితమంతా కష్టపడినా ఆత్మ అయిన నా కూడా రాని వాటినే సంపాదించుకున్నానే, నేను ఎంతో తెలివైన వాడినని అనుకున్నానే! ఇవేనా నా తెలివితేటలు అని ఎంత బాధపడితే

మటుకు ప్రయోజనం ఏం వుంటుంది?

ఎందుచేతనంటే? శరీరానికి లాభించేది ధనము, ఆత్మకు లాభించేది జ్ఞానము. కాని మానవులు తాము దేహం అనే భావంలో వుండడం వల్ల అందరూ కూడా ధన సంపాదనకే ప్రాముఖ్యం ఇస్తున్నారు, ధనం వెనకాలే పడుతున్నారు. అంతేకాదు ధనం ఉన్నవాడే గొప్పవాడు అని అనుకుంటారు, ధనం ఉన్నవాడికే గౌరవం ఇస్తారు, ప్రాముఖ్యం ఇస్తారు. ధనం లేనివాడిని తక్కువగా, హీనంగా చూస్తారు. అందుచేత ప్రతి ఒక్కరూ ధనం సంపాదించడానికి ప్రాముఖ్యం ఇస్తున్నారు. అంతేకాదు వారికున్న సమయంలో ఎక్కువ సమయం ధన సంపాదనకే కేటాయిస్తారు. వారు ఉద్యోగం చేసినా, వ్యాపారం చేసినా, వ్యవసాయం చేసినా, ఏదైనా వృత్తి చేసినా అన్ని ధన సంపాదన కోసమే!

ఎందుచేతనంటే ధనం వల్ల శరీరానికి సుఖం లభిస్తుంది, వారి గొప్పను పెంచుతుంది, సమాజంలో గౌరవం లభిస్తుంది. అందుకే మానవులు ధన సంపాదనకు ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు, కానీ ఒక్కరికి కూడా తాను ఆత్మను అన్న విషయం తెలియదు. ఇదే సృష్టిలో ఉన్న విచిత్రం, భగవంతుని యొక్క మాయ.

ఈ మాయ నుంచి బయట పడాలంటే? సుమారు మూడు, నాలుగు వందల జన్మలు తీసుకోవలసి వస్తుందని పత్రి గారు చెప్పడం జరిగింది.

అందుకే పెద్దలు సద్గురువును ఆశ్రయించమని, సత్యాన్ని తెలుసుకోమని, సత్యంలో జీవించమని చెప్తారు. ఎందుచేతనంటే సద్గురువు తప్ప ఎవరు నువ్వు ఆత్మవు అన్న సత్యాన్ని చెప్పరు, నీకు కావాల్సింది జ్ఞానం అని చెప్పరు. అందుచేత ఈ మాయ నుంచి బయట పడాలన్నా, నేను ఆత్మను అన్న సత్యం తెలుసుకోవాలన్నా, జ్ఞానాన్ని సంపాదించు కోవాలన్నా ఎవరైనా సద్గురువును తప్పనిసరిగా ఆశ్రయించవలసిందే.

లేకపోతే వారి జన్మను వృధా చేసుకున్న వారు అవుతారు, యోగులు చెప్పినట్టు "ఆత్మహంతకులు" అవుతారు.

ఇంకా విచిత్రం ఏమిటంటే? ఒకవేళ సద్గురువు లభించి తాను ఆత్మ అని తెలుసుకున్నా కూడా కొంతమంది తాను కానీ శరీరానికి లాభించే ధనం విషయంలో ఎంత సంపాదించినా తృప్తి పడరు, కానీ ఆత్మ అయిన తనకు లాభించే జ్ఞానం విషయంలో తృప్తి పడిపోతారు. ధ్యానం చేయడం విషయంలో కానీ, జ్ఞానం సంపాదించే పనుల విషయంలో కానీ ఎక్కడికక్కడ తృప్తి పడిపోతారు, ఇంతకన్నా ఇంకేం చేస్తాం అనుకుంటారు.

కానీ యోగులు ఏమి చెప్తారంటే, **"కూడా రాని ధనం విషయంలో తృప్తి పడాలి, అంతే కాని కూడా వచ్చే జ్ఞానం విషయంలో తృప్తి పడకూడదు"** అని చెప్తారు.

ధనం విషయంలో తృప్తి పడాలని నేను ఎందుకు చెబుతున్నాను అంటే, ధనం విషయంలో తృప్తి పడితే మీరు ధర్మంగా సంపాదిస్తారు, సంపాదించిన ధనంతో అవసరాలకు పరిమితమై మీ జీవితాన్ని గడుపుతారు, మీరు ఏ రంగంలో ఉన్నా కూడా ధర్మంగానే సంపాదిస్తారు.

ఒకవేళ మీరు కోరికలకు బానిసై సంపాదించింది చాలదు అని మీరు అధర్మంగా సంపాదిస్తే లాభం పొందడం మాట అటుంచి, ఎంతో నష్టపోతారు, కష్టాల పాలవుతారు. అందుచేత ఉన్నదానితో సంతృప్తి చెందాలి, గతంలో నువ్వు సంపాదించుకున్న అర్హతను బట్టే ప్రస్తుతం నీకు వున్నది వచ్చిందని గుర్తుపెట్టుకోవాలి, అర్హత లేకుండా ఎక్కువ కావాలంటే ఎక్కడి నుంచి వసుంది?

అసలు నువ్వు భూమి మీదకు డబ్బు సంపాదించడానికి రాలేదు. నువ్వు వచ్చింది జ్ఞానం సంపాదించడానికి అన్న విషయం భూమి మీదకు వచ్చాక మర్చిపోయావు, అందరినీ చూసి వారిలాగే డబ్బు సంపాదించు కోవాలని అనుకుంటున్నావు, కానీ నువ్వు వచ్చింది జ్ఞానం సంపాదించ

డానికి. అందుచేత డబ్బు విషయంలో ఉన్నదానితో తృప్తి పడు, జ్ఞానం విషయంలో తృప్తి చెందకు.

నీ అర్హతను బట్టి నీకు ఎంత డబ్బు రావాలో అంతా వచ్చేసింది. ఒకవేళ భవిష్యత్తులో ఏమైనా రావలసి ఉంటే తప్పనిసరిగా ఆ సమయంలో వస్తుంది, దానికి నువ్వేం ప్రయత్నించనక్కర్లేదు, అధర్మంగా, సృష్టి విరుద్ధంగా సంపాదించనక్కరలేదు.

ఆత్మవైన నీకు లాభించే జ్ఞానం ఇంకా ఇంకా సంపాదించాలి, ఇంకా ఎదగాలి, శ్రీకృష్ణుడు, బుద్ధుడు, పత్రీజీలాగ గొప్పవాడుగా అవ్వాలి, ఇంకా గొప్ప లోకాలకు వెళ్ళాలి. ఎందుచేతనంటే ఈ సృష్టిలో జ్ఞానం అనంతమైనది. దీనికి లిమిట్ లేదు, ఎంత సంపాదించుకున్నా ఇంకా సంపాదించుకోవచ్చు, ఇంకా గొప్పవారు కావచ్చు.

పత్రిగారు ఏమన్నారంటే? శివుడికి వున్నంత జ్ఞానం ఎవరికీ వుండదు. ఆయన దేవుళ్ళందరికంటే గొప్పవాడు. అంత గొప్పవాడైన శివుడే తనకున్న జ్ఞానంతో తృప్తి పడకుండా, ఇంకా అనంతమైన జ్ఞానాన్ని సంపాదించుకోవడానికి నిరంతరం ధ్యానం చేస్తున్నాడే! మరి మనం ఎంత కష్టపడాలి? ఎంత కృషి చేయాలి? ఎంత జ్ఞానాన్ని సంపాదించాలి? ఆలోచించండి! అంటారు పత్రీజీ.

అసలు చాలామందికి శివుడు ఎందుకు ధ్యానం చేస్తున్నాడో కూడా అర్థం కాదు. ఆలోచించండి మీరు చేసే కొద్దిపాటి ధ్యానానికే మీరు సంతృప్తి పడిపోతారే! కొద్దిపాటి జ్ఞానం సంపాదించక పోయినా సంతృప్తిపడి చాలు అనుకుంటారే! ఆలోచించండి శివుడు తెలివి తక్కువ వాడా? ఊరికే ధ్యానం చేస్తున్నాడా? అంటే కాదనే అర్థమవుతుంది.

అనంతమైన ఈ సృష్టిలో ఎవరైనా సరే ఎంత ఎక్కువ ధ్యానం చేస్తే అంత శక్తివంతులు అవుతారు, ఎంత ఎక్కువ జ్ఞానం సంపాదిస్తే అంత గొప్పవారు కాగలుగుతారు. అందుకే చూడండి చిరంజీవులు అని

చెప్పబడుతున్న ఆంజనేయ స్వామి, పరశురాముడు, అశ్వద్ధామ, విభీషణుడు లాంటి వారంతా ఇంకా ధ్యాన స్థితిలోనే భూమిమీద ఉన్నారు. అలా వారు యుగాల నుంచి ఎదుగుతూనే ఉన్నారు.

అందుచేత తెలుసుకోండి ధ్యానానికి, జ్ఞానానికి సంతృప్తి వుండకూడదు, కారణం మీరంతా ఆత్మలు కాబట్టి.

నా విషయానికి వస్తే! ప్రతిరోజు నేను చెప్పే గొప్పవారి సందేశాలు, యోగేశ్వరుల బోధలు, వారు చెప్పిన జ్ఞానం నా అనుభవాల నుంచే చెప్తున్నాను. 22 సంవత్సరాల క్రితం పత్రి గారితో నాకు పరిచయం అయ్యింది. మాటల సందర్భంలో ఆయన ఏమన్నారంటే? " నువ్వు దేహం కాదయ్యా" అన్నారు. నాకు మతి లేదు, మళ్లీ అడిగాను, అదేమీటండి నేను దేహం కాకపోతే మరి నేను ఎవరిని? అని. నువ్వు ఆత్మవు అన్నారు. నాకు ఇంకా ఆశ్చర్యం వేసింది ఎందుచేతనంటే? అప్పటివరకు ఆ మాటే నేను వినలేదు. అందుచేత నేను వెంటనే నమ్మలేదు. కాని ఆయన సింపుల్ గా అన్నారు. కానీ నేను దేహం కాదు అన్నది, నేను ఆత్మ అన్నవి రెండూ నేను ఎప్పుడూ వినని విషయాలు, ఊహించని విషయాలు.

కాని నేను అంతటి గొప్పవాళ్ళు ఎవరు ఏ విషయం చెప్పినా ఊరికే విని వదలను, దాన్ని చాలా లోతుగా అధ్యయనం చేస్తాను. అందుకే తరువాత పత్రిగారు చెప్పినవి ఎంతవరకు కరెక్ట్ అని కొన్ని పుస్తకాలు చదవడం, ఉపనిషత్తులు, భగవద్గీత, కొన్ని పురాణాలు, ఇంకా కొంతమంది మాస్టర్స్ సందేశాలు చదివాను, విన్నాను. అప్పుడు నాకు అర్థమైంది పత్రి గారు చెప్పింది సత్యము అని. అప్పుడు నేను ఆత్మను అన్నది అర్థం చేసుకున్నాను.

అప్పటికి నా వయస్సు 53 సంవత్సరాలు, రాత్రీ పగలు కష్టపడి చాలా డబ్బు సంపాదించాను. ఓ రకంగా చెప్పాలంటే కోట్లే సంపాదించాను. అప్పుడు ఆలోచించాను సరే ఇన్ని కోట్లు సంపాదించాను కదా? ఈ కోట్లు

నాకు అంటే ఆత్మకు ఏమైనా లాభిస్తాయా? అని. కాని ఆత్మ అయిన నాకు ఈ కోట్ల ధనం ఏమీ లాభించదు, ఉపయోగపడదు అన్న విషయం నాకు అర్థమయింది. ఇదంతా నేను మళ్ళీ, మళ్ళీ బాగా విశ్లేషణ చేయడం వల్ల అర్థమైంది. అంతేకాదు నేను సంపాదించిన భూములు, బిల్డింగులు, షాపులు, ఇండస్ట్రీలు, బంగారం, ఆస్తులు చనిపోయాక అన్నీ భూమి మీదే వదిలి వేయవలసి వస్తుందని అర్థమయ్యింది.

అప్పుడు ఇంకా ఆలోచించాను ఇంత కష్టపడ్డానే, ఇంత డబ్బు సంపాదించానే! ఆ డబ్బు వల్ల ఆత్మైన నాకు ఏమైనా లాభం వుందా? ఆలోచిస్తే ఏమీ లాభం లేదు అన్నది అర్థమైంది.

ఆశ్చర్యపోయాను అంటే నా 53 సంవత్సరాల జీవితాన్ని నేను వృధా చేశానా? ఏడాది కాదు, రెండేళ్ళు కాదు, ఏకంగా 53 సంవత్సరాల నా జీవితాన్ని వృధా చేసుకున్నానని అర్థమయ్యింది. ఈ 53 సంవత్సరాలు ఆత్మకు అంటే నాకు ఏమీ లాభం లేకుండా జీవించానే, జీవితాన్ని ఎంత నష్టపరచుకున్నాను అని భాధ పడ్డాను.

కానీ ఈ యోగీశ్వరుల సందేశం తెలుసుకున్నాక, నేను జీవించిన ఆ 53 సంవత్సరాలు నేను 'ఆత్మ హంతకుడు' క్రిందే లెక్క అని అర్థమయ్యింది.

అప్పుడు మళ్ళీ ఆలోచించాను. మరి ఆత్మైన నేను లాభం పొందాలి అంటే నేను జ్ఞానం సంపాదించుకోవాలి, జ్ఞానమే నాకు లాభిస్తుంది అని తెలుసుకున్నాను. అంతేకాదు జ్ఞానమే నన్ను గొప్పవాడిగా తీర్చిదిద్దేది, జ్ఞానమే నా కర్మలన్నీ దగ్ధం చేసేది, జ్ఞానమే నన్ను ఉన్నత లోకాలు చేర్చగలిగేది. జ్ఞానమే మోక్షాన్ని సంపాదించి పెట్టేది, జ్ఞానమే నా జీవిత లక్ష్యమైన సత్య లోకాన్ని చేర్చగలిగే అన్నది అర్థమైంది.

నేను ఇంకా ఆలోచించాను. మరి ఇప్పటివరకు కొద్దిపాటి జ్ఞానం కూడా సంపాదించుకోలేదే! ఇప్పుడు ఏమి చెయ్యాలి? అసలు జ్ఞానం అంటే

ఏమిటి? జ్ఞానం సంపాదించాలంటే ఏం చేయాలి ? జ్ఞానం సంపాదించుకుంటే వచ్చే లాభాలు ఇంకా ఏమైనా ఉన్నాయా? మరి ఇవన్నీ ఎలా తెలుస్తాయి? అన్న ప్రశ్నలు వచ్చాయి.

అప్పుడు పత్రి గారు తప్ప ఇంకెవ్వరి ద్వారా ఇంత క్లియర్‌గా ఆత్మైన నాకు కావాల్సింది ఎవ్వరు చెప్పలేరు అన్న సంగతి కూడా అర్థం చేసుకున్నాను. ఆయన ఏం చెప్పారంటే ఆత్మైన నాకు లాభించే జ్ఞానం పొందాలి అంటే నాలుగు పనులు చేయాలని చెప్పారు.

1) "శ్వాస మీద ధ్యాస" ఉంచి తీవ్ర ధ్యాన సాధన చేయాలి, దానితో పాటు సాత్వికమైన శాకాహారం తీసుకోవడమే కాదు, ఈ రెండూ చాలా స్ట్రిక్ట్ గా పాటించాలని అర్థమయ్యింది.

2) ఆత్మజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు అంటే యోగులు, మహర్షులు, యోగీశ్వరులు వ్రాసిన ఆత్మజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు చదవాలి అన్నది కూడా తెలుసుకున్నాను.

3) అలాగే ఆత్మజ్ఞానాన్ని బోధించగలిగే వారి సందేశాలు వినాలి. అవి తప్ప మిగతావి అంటే దేహలాభాలకు సంబంధించినవి, మనో లాభాలకు సంబంధించినవి ఎన్ని విన్నా వృధా అన్నది కూడా అర్థమైంది.

అందుకే వశిష్టుల వారు ఈ మూడిటిని 'ఆధ్యాత్మిక త్రిరత్నాలు' అన్నారు.

4) పత్రి గారు ఇంకొక ముఖ్య విషయం చెప్పారు. ఈ జ్ఞాన మార్గంలో సేవ చెయ్యాలి అన్నారు.

నేను మళ్లీ ఆలోచించాను, పత్రి గారు ఎందుకు ఈ జ్ఞాన మార్గంలో సేవ చేయాలి అన్నారు? అని.

ఆయన ఈ సృష్టిలో ఉన్న ఒక గొప్ప ధర్మ సూక్ష్మం, **"ఏదైనా సరే పంచుతూ ఉంటే అది పెంచబడుతుంది"**అని చెప్పారు. అది ధనం కావచ్చు, ఆనందం కావచ్చు, శాంతి కావచ్చు, జ్ఞానం కావచ్చు, ఏదైనా సరే. అందుచేత

ఇప్పుడు నాకు కావాల్సింది జ్ఞానం. కాబట్టి ఈ జ్ఞానం పెంచుకోవాలి అంటే పంచాలి అని తెలుసుకున్నాను. అప్పటినుంచి జ్ఞానాన్ని సంపాదించు కోవడం, సంపాదించుకున్న జ్ఞానాన్ని పంచడం మొదలుపెట్టాను. అలా పంచడం మొదలు పెట్టినప్పటినుంచి నా జ్ఞానం మెల్లి, మెల్లిగా పెరుగుతూనే వుంది.

పత్రి గారు చెప్పినట్టు పంచుతూ ఉంటే అలా అందుతూనే వుంది. అలా చెప్తున్నప్పుడు నాకు ఆశ్చర్యమేసింది. నాకు చెప్పడానికి ఇంకేం వుంటాయి అనుకునేవాడిని. కాని లోపలి నుంచి అలా అందుతూనే ఉంది. అప్పుడు పత్రిగారు చెప్పింది సత్యము అన్నది అర్థమైంది. ఈ ప్రకృతి సూత్రం ఎవరికైనా వర్తిస్తుంది.

అందుచేత ఏదైనా 'పంచింది పెంచబడుతుందని' తెలుసుకోండి. అది జ్ఞానమే కాదు, ధనమైన సరే, ఏదైనా సరే పంచితే కచ్చితంగా పెరుగుతూనే ఉంటుంది. జ్ఞానం ఏదో చదివి సంపాదించుకోవడమే కాదు, వున్నది అందరికీ ఇస్తూ ఉంటే కూడా పెరుగుతుంది అన్నది అర్థమైంది.

ఇంకా ఆలోచించాను నాకు ప్రకృతి చేత ఇవ్వబడిన ధనాన్ని ఎందుకు వృధా చేయాలని, నాకున్న ధనాన్ని జ్ఞాన సంపాదనకే వెచ్చించడం మొదలు పెట్టాను. అప్పటి నుంచి లగ్జరీలకి, సరదాలకి, సుఖాలకి ఏమి నేను ఖర్చు పెట్టట్లేదు. కానీ మా పిల్లలంతా కోట్లు విలువ చేసే బిల్డింగులు కట్టుకున్నారు. అయినా  మేము ఆ పాత బిల్డింగులోనే వున్నాం. కానీ మా అవసరాలు తీరుతున్నాయి. అందుచేతే  జ్ఞానాన్ని పెంచడానికి భీమవరంలో మూడు రోజుల ఆత్మజ్ఞాన శిక్షణా తరగతులు ప్రారంభించాము.

అంతేకాదు నేను చేసే వ్యాపారాలన్నీ మూసేశాను, నాకున్న పదవులన్నీ వదిలేసాను, మా పిల్లల్ని బయటకు పంపేశాను, ఒక రకంగా చెప్పాలంటే మా సరదాలే కాదు, పెళ్లిళ్లు, ఫంక్షన్లు, చావులు అన్నిటికీ వెళ్లడం మానేశాను. కారణం ఆ సమయాన్ని కూడా జ్ఞాన సంపాదనకే

వినియోగిస్తున్నాము.

అప్పటికీ మాకు తృప్తి కలగలేదు, కారణం జ్ఞాన విషయంలో ఎందుకు తృప్తి పడాలి? అని అనిపించింది. అప్పుడు మిగతా రోజులలో అన్ని ఊర్లు తిరిగి ఈ జ్ఞానం బోధించడం మొదలు పెట్టాము.

మెల్లిమెల్లిగా ఆ ఊర్లతో సరి పెట్టలేదు, జిల్లాలు తిరగడం, రాష్ట్రాలు తిరగడం, దేశాలు తిరగడం కూడా చేస్తున్నాం. ఎంత వీలైతే, ఎంత అవకాశం ఉంటే అంతా తిరుగుతున్నాం. ఎందుకు ఊరుకోవాలి? ఎందుకు ఇంట్లో పడుకోవాలి? అందుకని అవిశ్రాంతిగా తిరుగుతున్నాం. అప్పటికే 53 సంవత్సరాల జీవితాన్ని నేను వృథా చేశాను. ఇంకెందుకు నా జీవితాన్ని వృథా చేసుకోవాలి? నాకు వున్న యవ్వన జీవితమంతా వృథా అయి పోయింది. కనీసం ఈ వయసులో అయినా చేయగలిగినంత చెయ్యాలి, తిరగ గలిగినంత తిరగాలి, సంపాదించుకోగలిగినంత జ్ఞానం సంపాదించు కోవాలి అన్నదే మా ఇద్దరి ఆశయం.

ఎందుకంటే నేను వ్యాపారం చేసేటప్పుడు ఒక్కరోజు నా రైస్ మిల్‌కి వెళ్లకుండా ఇంట్లో కూర్చుంటే అనిపించేది అక్కడ ఏమై పోతుందో, ఎంత నష్టం జరుగుతుందో, చూడకపోతే, వెళ్ళకపోతే ఎలా? అని మనసులో బాధ కలిగేది. మర్నాడు రైస్ మిల్లుకి వెళ్లిపోయేవాడిని.

అప్పుడు డబ్బు గురించి, వ్యాపారం గురించి ఎలా మనో వేదన పడ్డానో! ఇప్పుడు జ్ఞానం విషయంలో కూడా ఏ రోజైనా అలసిపోయి ఇంట్లో కూర్చుంటే ఏంటి అలిసిపోయావా? ఈమాత్రం దానికే కూర్చుంటే ఏమి వస్తుంది? అని లోపలి నుంచి అంతర్మథనం అంటే ఆత్మ క్షోభిస్తుంది. అప్పుడు మళ్లీ బ్యాగ్ వేసుకొని ఏదో పక్కకి బయలుదేరడం జరిగేది. నేను, మా మేడమ్ ఎవరు పిలుస్తే అక్కడికి వెళ్తున్నాము, లేకపోతే వస్తామని చెప్పి మరీ వెళ్తున్నాం.

కాని వెళ్ళినప్పుడు ఉన్న తృప్తి, ఇంట్లో ఉంటే ఉండట్లేదు. అది

అనుభవించిన వారికి తెలుస్తుంది. నాకు అర్థమైంది ఎవరి ఆత్మ ఎంత క్షోభిస్తూ ఉంటే వారు అంత నష్టపోతున్నట్టు లెక్క అని. అలాగే మీ ఆత్మకు ఎంత ఆనందం కలిగిస్తే మీరు అంత గొప్పగా ఎదుగుతున్నట్టు, లాభం పొందుతున్నట్టు లెక్క. అందుచేత మా ఇద్దరిలాగే మీరు కూడా మీ అంతరంలో ఉన్న ఆత్మను పరి శీలించుకోండి, మీకు ఇంకేమీ అవసరం లేదు.

మీ అంతరంలో ఏదైనా కొంచెం బాధ కలుగుతుంటే, ఆత్మ క్షోభ పడుతున్నట్టు అంటే  నువ్వు ఆత్మను నష్ట పరుస్తున్నట్టు లెక్క అని తెలుసుకోవాలి. ఆత్మ క్షోభ వేరు, మనోవేదన వేరు. నేను వ్యాపారం చేసేటప్పుడు కలిగేది మనోవేదన కానీ ఈ ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చిన తర్వాత కలిగేది ఆత్మ క్షోభ. ప్రాపంచికమైన నష్టం కలుగుతున్నప్పుడు మనసుకు వేదన కలుగుతుంది, ఆత్మకు నష్టం కలుగుతున్నప్పుడు ఆత్మ క్షోభిస్తుంది. ఇది ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.

ఆత్మ మార్గంలో ప్రయాణించేటప్పుడు ప్రకృతి మనకు ఎన్నో అవకాశాలు కల్పిస్తుంది. కాని అవకాశం దొరికినా మనసు యొక్క సలహాతో నిర్లక్ష్యం చేస్తే, ఆత్మ ఉన్నతమైన స్థితికి వెళ్లే అవకాశం లేకుండా పోతుంది, అప్పుడే ఆత్మ క్షోభిస్తుంది. కానీ ఆత్మకు లాభించే పనులు చేస్తే ప్రకృతి యొక్క సహకారం మీకు లభిస్తుంది. నిజంగా నాకు గాని, అమ్మకు గాని ఇంతలా తిరిగే ఓపిక లేకపోయినా  సరే తిరుగుతుంటే ఎవరో ఒకరి రూపంలో మాకు ఎక్కడికక్కడ సహాయం అందుతుంది, సహకారం అందుతుంది.

మేము చేస్తున్నది ఏదీ లేదు. మాకున్న జ్ఞానాన్ని కాస్త మా నోటితో పదిమందికి పంచుతున్నాం అంతే. మీ దగ్గర ఉన్న డబ్బుని ఎలా పంచుతారో! మీ దగ్గర ఉన్న జ్ఞానాన్ని కూడా ఎంత ఎక్కువ మందికి వీలైతే అంత ఎక్కువ మందికి పంచాలి. ఇది నేను పత్రి గారిని గమనించి

తెలుసుకున్నాను. పత్రీజీ  చేసిన పని కూడా అదే.

ఆయన చనిపోయే పరిస్థితిలో కూడా లధాక్ వెళ్లి వచ్చారు. అప్పుడు నాకు అర్థమైంది మనకు కొన ప్రాణం ఉన్నంతవరకు చేయవలసింది చేయాలి అని. అసలు ఎందుకు తృప్తి పడాలి? ఈ శరీరం నీకు ఇవ్వబడింది ఉపయోగించుకో! దీనితో ఉపయోగం లేని, పనికిరాని పనులు ఎందుకు చేస్తావు? ఆత్మకు లాభం లేని పనులు ఎందుకు చేస్తావు? ఇంకా ఎన్ని జన్మలు తీసుకుంటావు? ఎన్ని శరీరాలు మారుస్తావు? మన అదృష్టం కొద్దీ ఈ జన్మలో పత్రిగారు పరిచయమై దారి చూపించారు. దానిని ఉపయోగించు కోవాలి ఆలోచించండి.

నేను ఎప్పుడైతే ఈ పనులు చేస్తున్నానో నా ప్రక్కన నా భార్యతో ఈ విషయాలు చెప్తూనే ఉంటాను, చర్చిస్తూనే ఉంటాను. ఆవిడలో కూడా చాలా ఇన్స్పిరేషన్ వచ్చింది.  ఆవిడ కూడా విశ్రాంతి తీసుకోవట్లేదు.

అందుచేత **"ధన సంపాదనలో తృప్తి పడండి. జ్ఞాన సంపాదనలో తృప్తి లేకుండా సంపాదించండి".** దానికి ముఖ్య కారణం ఈ దేహం మీరు కాదు, మీరు ఆత్మ అని అర్థం చేస్కోండి. జీవితకాలం జీవించినా ఆత్మకు కావలసిన పనులు చేయకపోతే వారు 'ఆత్మ హంతకులు' అవుతారని తెలుసుకోండి. ఆత్మకు నష్టం కలిగించకండి, ఆత్మను క్షోభ పెట్టకండి.

మానవునకు  అవసరాలు వుంటాయి, కాదని నేను అనను. అవసరాలు అన్నీ చూసుకోండి, దానికి తప్పేమీ లేదు. మానవునకు తిండి కావాలి, వుండడానికి ఇల్లు కావాలి, బట్ట కావాలి, స్త్రీకి పురుషుడు, పురుషుడికి స్త్రీ తోడు కావాలి, ఈ అవసరాలు తప్పవు. వాటి కోసం ధర్మంగా సంపాదించాలి. సంపాదించొద్దని నేనేమీ చెప్పను. అవన్నీ తీర్చుకుంటూ మీ పరిధిలో మీ సమయాన్ని, వృధా చేయకుండా ఆత్మ లాభానికి ఉపయోగించండి.

మళ్లీ ఇందులో ఆవేశం పనికిరాదు. కొంతమంది నేను ఉద్యోగం

మానేసి ఈ పనే చేస్తా అంటారు. మానేసి ఎం చేస్తావు? తిండి ఎక్కడ నుంచి వస్తుంది? సంసారాన్ని పోషించవా? వాళ్లని ఏం చేస్తావు? పెళ్లి చేసుకుని మొగుడిని ఏం చేస్తావు? పెళ్ళాన్ని ఏం చేస్తావు? పిల్లల్ని కని పిల్లల్ని ఏం చేస్తావు? సంసార ధర్మాన్ని పాటిస్తూనే నీకు ఇవ్వబడిన అవకాశాన్ని వృధా చేయకు. అదే నువ్వు చేయవలసింది.

గుర్తుంచుకోండి **"భుక్తి లేకుండా ముక్తి ఉండదు. భుక్తి వుంటేనే ముక్తి వుంటుంది".**

ఎప్పుడైతే నువ్వు భుక్తి చూసుకుంటూ సమయాన్ని, జీవితాన్ని వృధా చేయకుండా జ్ఞానానికి వెచ్చిస్తే మరు జన్మ ఇంకా అనుకూలమైన జన్మ వస్తుంది. ఈ జన్మలోనే రావాలని ఎప్పుడూ అనుకోకండి. కాని ప్రయత్నం చెయ్యండి, సమయాన్ని  వృధా చేయకండి.

అక్కర్లేని వాటికి మీ సమయాన్ని, శక్తిని, వాక్కుని ఖర్చు పెట్టకండి. మనమంతా ఆత్మలం అన్న  విషయం మర్చిపోకండి. పదేపదే గుర్తుంచు కోండి. "నేను దేహం కాదు, నేను దేహం కాదు, నేను ఆత్మను, నేను ఆత్మను" అని పదే పదే తలుచుకుంటూ గుర్తుంచుకోండి. ఒక ప్రణాళిక ప్రకారం ఈ భూమ్మీదకి వచ్చారు. ఆ ప్రణాళికకు భిన్నంగా మీరు ఇక్కడ జీవిస్తే,  మీ శరీరం లోపల వున్న ఆత్మ మీరు చేయవలసింది చెయ్యట్లేదు అని ఘోషిస్తూ ఉంటుంది.

మీకు అన్నీ మీ ఆత్మే చెప్తుంది. అందుచేత ఆత్మను పట్టించుకోక పోయినా,  లెక్కచేయక పోయినా నష్టపోయేది నువ్వే. లెక్క చేస్తే లాభం పొందేది నువ్వే.  ఇది ప్రతి ఒక్కరూ గమనిస్తే అర్థం అవుతుంది.  కావాలంటే గమనించుకోండి. అందుకే నాకు పత్రిగారంటే అంత గౌరవం. లేకపోతే నేను ఎలా ఉండేవాడినో, ఏ పరిస్థితుల్లో ఉండేవాడినో. ఆత్మైన నాకు ఏం కావాలో, జ్ఞానం సంపాదించాలంటే ఏం చేయాలో అన్నీ ఆయన బోధించాడు, అన్నీ ఇచ్చాడు.

ఒక సందర్భంగా మేడం, నేను పత్రిగారితో ఉన్నప్పుడు ఆయన ఏమన్నారంటే? "అమ్మా ఇంకేం చెప్పను నేను, చెప్పాల్సిందంతా చెప్పేసాను, ఇంకేముంది నా దగ్గర అన్నారు."

ఎందుకంటే చాలామంది పత్రిగారు ఇంకా ఏం చెప్తారు? ఇంకా ఏం చెప్తారు? అని చూస్తారు. అంతకుముందు చెప్పినవన్నీ ఆచరించినట్టు.

నేను ఆశ్చర్యపోయాను నేను. ఆయన దగ్గర ఉన్నది దాచుకోకుండా ఇచ్చేశాడు. ఆయన అన్న ఆ మాటే నాకు ఇన్స్పిరేషన్. నేను కూడా దాచుకోకూడదు, నా దగ్గర ఏముంటే అది అందరికీ పంచాల్సిందే అని అనుకున్నాను. మొదట్లో వాళ్ళు ఎదిగిపోతారు కదా? అని అనుకునే వాడిని.

తర్వాత అర్థమైంది ఏంటి ఎదిగేది? ఎంత ఎదుగుతారు? తెలిస్తే మటుకు ఎక్కడ అర్థమవుతుంది? ఎక్కడ ఆచరిస్తారు? జ్ఞానం అన్నది అంత తేలికా! ఒకవేళ ఎదిగినా మంచిదేగా! తనలాంటి వారిని ఒకరిని తయారు చేయగలిగితే ప్రకృతి ఎంత సంతోషిస్తుంది? అందుచేత ఏదైతే నా దగ్గర ఉందో! లోపలి నుంచి అందుతుందో! అది పంచి పెట్టడమే చెయ్యాలి అని నిర్ణయించుకున్నాను.

అందుచేత మీరు కూడా ఇది దృష్టిలో పెట్టుకోండి. మీరు ఆత్మ అన్న సంగతి మర్చిపోకండి. మీ పరిధిలో అవకాశం ఉన్నంత మేర ఆత్మ లాభానికి జ్ఞానాన్ని సంపాదించుకోవడానికి ప్రయత్నించండి, "ఆత్మ హంతకులు కాకండి."

# స్పిరిచ్యువల్ సిక్నెస్ - ఆధ్యాత్మిక అనారోగ్యం

ఫిజికల్ సిక్నెస్ అంటే భౌతికమైన అనారోగ్యం. అంటే దేహానికి ఏదైనా జబ్బు చేసినా, శరీరానికి ఇబ్బంది కలిగినా వాళ్ళు ఏ పని చేయలేరు. హాస్పిటల్లో జాయిన్ అవుతారు, లేదా ఇంటి దగ్గరే మంచం మీద నుంచి లేవలేరు. అనారోగ్యంతో చేసే పనులు కూడా చేసుకోలేరు. ఒకరకంగా వాళ్ళు ఉన్నా లేనట్టే. అలా కొన్నాళ్లు సిక్ అయ్యి, ఆరోగ్యంగా మారాక, ఎవరికైనా కనపడితే ఏంటి ఇన్నాళ్లు కనపడలేదు అంటే! ఏమీ లేదు సిక్ అయ్యానురా అంటాడు. అంటే భౌతికమైన అనారోగ్యం.

అలాగే ఆధ్యాత్మిక అనారోగ్యం అంటే ఆత్మ పరమైన కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఆత్మకు లాభించే పనులు చేస్తూ, కొన్నాళ్ళ కనిపించరు, అప్పుడు అందరూ అడుగుతారు! ఏంటి ఏమైపోయావు ఇన్ని రోజులు అని? అప్పుడు వాళ్ళు ఏదో ఒక కారణం చెప్తారు. ఏదైనా వారు చేసే సాధనలో గ్యాప్ వచ్చింది, అలాంటివారు ఆధ్యాత్మికంగా సిక్ అయినట్టే. దీనినే స్పిరిచ్యువల్ సిక్‌నెస్ అంటారు. అంటే ఆధ్యాత్మిక అనారోగ్యం అంటారు. ఈ మూడు రోజుల క్లాస్‌కి రెగ్యులర్‌గా వచ్చేవాళ్లు మధ్యలో రాకపోతే వాళ్ళని అడుగుతాం కదా ఎందుకు రాలేదని? దీన్నే స్పిరిచువల్ సిక్నెస్ అంటారు. భౌతికంగా సిక్ అయితే శారీరకంగా చిక్కిపోతారు, స్పిరిచువల్‌గా సిక్ అయితే సంపాదించుకున్న శక్తిని కోల్పోతారు.

శక్తి పెరిగే కొద్దీ వాళ్ళు చేసే పనులు బాగుంటాయి. శక్తి తగ్గే కొద్ది ఆ రకమైన పనులు చేయలేరు. ఎందుకు చేయలేరు? సిక్ అయ్యారు కాబట్టి. శక్తి బాగా ఉంటే బుద్ధి బాగా పనిచేస్తుంది, మంచి నిర్ణయాలు తీసుకుంటారు, మంచి పనులు చేస్తారు, ఆత్మకు లాభించే పనులే చేస్తారు,

ఆధ్యాత్మికంగా ఆత్మ పరంగా లాభం పొందుతారు. కానీ శక్తి తగ్గిపోతే అన్ని రకాలుగా నష్టపోతారు.

నిజంగా స్పిరిచువల్‌గా హెల్దీగా వుంటే వారిలో శక్తి విజృంభించి వుంటుంది. అప్పుడు వారి మనసు శుద్ధమవుతుంది, వారి గుణం మారుతూ ఉంటుంది, బుద్ధి వికసిస్తుంది, వివేకం కలుగుతుంది, ప్రతీ విషయాన్ని విచారణ చేయగలుగుతారు. రమణ మహర్షి, శంకరాచార్యుల వారు కూడా విచారణ చేయండి అని చెబుతారు కదా?

మరి ఎవరు విచారణ చేయగలరు? వివేకమున్నవారు చేయగలరు. ఎవరికి వివేకం పెరుగుతుంది? బుద్ధి వికసించిన వారికి. ఎవరికి బుద్ధి వికసిస్తుంది? మనసు శుద్ధి అయిన వారికి. ఎవరికి మనసు శుద్ధి అవుతుంది? శక్తి పెరిగిన వారికి.

ఫిజికల్ హెల్త్ దెబ్బ తింటే ఎలా చిక్కిపోతారో, స్పిరిచువల్ హెల్త్ దెబ్బతిన్నా అలాగే శక్తి తగ్గిపోతుంది. అందుకే ఒక స్థాయికి వచ్చేవరకు గ్యాప్ ఇవ్వకండి అని చెప్పేది. మీరు సంపాదించుకున్న శక్తి కోల్పోకుండా వుండటానికి.

ఇప్పుడు మనం స్పిరిచ్యువల్ రీసెర్చ్ అని ఒక స్పెషల్ క్లాస్ పెట్టుకున్నాం. కారణం మీకు శక్తి బాగా పెరగాలని. మీకు శక్తి ఎంత బాగా ఉంటే అంత బాగా రీసెర్చ్ చేయగలుగుతారు. దేనికి ఎవరి దగ్గరకీ పరిగెత్తనవసరం లేదు, అన్ని మీరే తెలుసుకుంటారు, ఇంకా బయట వాళ్లకి కూడా చెబుతారు. పత్రి గారు పరిచయమైన కొత్తలో నేను ఆయనను ఎన్నో సందేహాలు అడిగేవాడిని, ఆయన కొన్ని చెప్పేవారు. కానీ అలా అడుగుతూ ఉంటే నీ పరిస్థితి అక్టోపస్‌లా తయారైంది అన్నారు.

ఆక్టోపస్‌కు చాలా కాళ్లు వుంటాయి దానికి ఏ కాలు తీసి ఏ కాలు వేస్తుందో తెలియదు. నీ పరిస్థితి కూడా అలాగే వుంది అన్నారు.

తరువాత ఆయనను ఇంకా అడుగుతుంటే నీ లెవెల్ పెంచుకోవయ్యా, అప్పుడు అన్నీ నీకే తెలుస్తాయి అన్నారు. అప్పటినుంచి ప్రశ్నలు అడగడం మానేసాను. ఆయన సందేశాలు బాగా వినడం, పుస్తకాలు బాగా చదవడం, సాధన చేయడం బాగా పెంచాను.

ఆయనను కొన్ని ప్రశ్నలు అడగాలని లిస్ట్ వ్రాసుకున్నాను. కానీ ఆరు నెలల లోపే ఆ ప్రశ్నలన్నిటికీ నాకే సమాధానాలు దొరికాయి. ఆధ్యాత్మికంగా శక్తి పెంచుకుంటే మన ప్రశ్నలకు సమాధానాలు మనకే దొరుకుతాయని అర్థమైంది.

ఆధ్యాత్మికంగా రీసెర్చ్ చేసేవారు ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకుంటారు. అందుచేత ఈ మార్గంలో భీమవరం క్లాస్ ఎగ్గొట్టినా, జూమ్‌లో పాల్గొనకపోయినా స్పిరిచువల్‌గా సిక్ అయినట్టే. అందుచేత ఎప్పుడూ స్పిరిచువల్‌గా హెల్దీగా వుండాలి, భీమవరం వస్తే ధ్యానంలో పట్టు వస్తుంది, బుద్ధి వికసిస్తుంది. జూమ్లో జాయిన్ అయితే జ్ఞానంలో పట్టు వస్తుంది. బుద్ధి, జ్ఞానం ఉంటే పరిపూర్ణ మానవుడు అవుతారు.


పిల్లల్ని బుద్ధి జ్ఞానం లేదా? అని తిడతాం. అదేదో మనకి వున్నట్టు. నీకు బుద్ధి జ్ఞానం ఉండాలంటే స్పిరిచువల్‌గా హెల్దీగా వుండాలి. అంటే గుణాలు మారాలి. అంటే ఏ మానవుడైనా సరే తమో గుణం నుంచి రజోగుణంలోకి రావాలంటే 100 నుండి 150 జన్మలు పడుతుంది, రజోగుణం నుంచి సాత్వికానికి రావాలంటే కూడా 100 నుంచి 150 జన్మలు పడుతుంది.

కానీ ప్రతీ నెలా భీమవరం క్లాసులకు వస్తూ, జూమ్ లో జాయిన్ అవుతుంటే పొందే శక్తి వల్ల, జ్ఞానం వల్ల కొన్ని నెలల్లోనే గుణాన్ని మార్చుకుంటారు. పత్రిగారు బోధించిన 18 ఆదర్శ సూత్రాలలో 12వ సూత్రం "ప్రతి ఒక్కరు ధ్యానిగా వుండకూడదు, మాస్టర్‌గా ఎదగాలి"

అన్నారు. మాస్టర్ అంటే జ్ఞానాన్ని పెంచుకోవడమే కాదు, జ్ఞానాన్ని బోధించాలి. అంతేకానీ అనుభవాలు చెప్పడం కాదు. ఎప్పుడైతే స్పిరిచువల్‌గా హెల్దీగా వుంటారో అన్నీ సక్రమంగా చేస్తారు.

అందుకే నేను మొదటి నుంచి చెప్తున్నాను, తెలుసుకోవడం వేరు, ఆచరించడం వేరు అని. ఎందుచేతనంటే తెలుసుకున్నవాడు చెప్తాడు, చెప్పింది అర్థం చేసుకున్నవాడు ఆచరించి లాభం పొందుతాడు. అందుచేత తెలుసుకోవడం గొప్ప కాదు, ఆచరించిన వాడే గొప్పవాడని తెలుసుకోండి.

అందుచేత ఎవరైతే తాను ఆత్మై ఉండి, ఆత్మ లాభానికి కాకుండా దేహ లాభం కోసం జీవితమంతా కృషి చేస్తారో వారే 'ఆత్మ హంతకులు' అని తెలుసుకోండి.

బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

**ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం**

*భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.*

*నిర్వహించు ప్రదేశం: శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మందిరం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.*

*ప్రవేశం : మూడు రోజులకు భోజనం, వసతి ఉచితం*

వివరాలకు : ***తటవర్తి వీరరాఘవరావు,***
*తటవర్తి వారి వీధి, భీమవరం - **534 201.***
*సెల్ : 94403 09812, 94901 71853*

# ఆత్మ లాభం గురించి ఆలోచించండి!

జీవితకాలం జీవించినా ఆత్మ గురించి పట్టించుకోకపోయినా, ఆత్మ కోసం సమయాన్ని వినియోగించక పోయినా, అసలు ఆత్మ గురించి తెలుసుకోకపోయినా యోగులు వాళ్ళని ఆత్మహంతకులు అన్నారు.

ఎందుచేతంటే మనమందరం ఆత్మలం. ఆత్మలమైన మనం భూమి మీదకు వచ్చేటప్పుడు అంటే తల్లి గర్భంలో ప్రవేశించేముందు పైన కొన్ని నిర్ణయాలు చేసుకొని వస్తాం. పైలోకాల్లో ఉండేది ఆత్మ ఒకటే, దేహం వుండదు. అందుచేత నిర్ణయాలు తీసుకునేది ఆత్మే!

పైలోకాల్లో కులాలు, మతాలు ప్రాంతాలు ఇవేవీ ఉండవు. పైన ఆత్మ ఉన్నప్పుడు దేహం గురించి ఆలోచించదు, అందుచేత ఆత్మ తన కోసమే ఆలోచిస్తుంది, తన లాభమే చూసుకుంటుంది, తన ఉన్నతి, తన ఎరుగుదలే ఆత్మకు కావాలి.

ఆ ఆత్మకు ఏ దేశంలో పుడతానో, ఏ మతంలో పుడతానో, ఏ కులంలో పుడతానో, ఏ కుటుంబంలో పుడతానో, స్త్రీగా పుడతానో, పురుషుడిగా పుడతానో అన్నది అప్పుడు తెలియదు. ఆత్మ ఎంచుకున్న కర్మలను బట్టి ఎటువంటి జన్మ తీసుకోవాలి, ఎలాంటి శరీరం తీసుకోవాలి అన్నది నిర్ణయించబడుతుంది.

అక్కడ ఆత్మ తీసుకునే నిర్ణయాలన్నీ కూడా ఆత్మ ఎదుగుదల కోసమే ఉంటాయి, ఆత్మ లాభం కోసమే ఉంటాయి. అందుచేత ఆ రకమైన నిర్ణయాలు తీసుకుని భూమి మీదకి ఆత్మ వస్తుంది. దానికి అనుగుణమైనటువంటి జన్మ తీసుకుంటుంది. కానీ జన్మ తీసుకున్నాక ఇవన్నీ మర్చిపోతుంది.

జన్మ తీసుకున్నాక శరీరం వుంటుంది, శరీరంతో పాటు మనసు కూడా ఉంటుంది. ఈ మనసు ఆత్మను ఆవరించి ఉంటుంది. ఎప్పుడైతే

మనసు ఆత్మను ఆవరించి ఉంటుందో, ఆత్మను డామినేట్ చేస్తుంది. అప్పటిదాకా నేను నేను అనుకున్న ఆత్మ మరుగైపోతుంది. మనసు అనే కొత్త నేను బయలుదేరుతుంది, ఇంక అంతా మనసు ఇష్టమే.

ఈ మనసు ప్రపంచంలోకి వచ్చిన తరువాతే వచ్చింది. ఆ పైలోకాల గురించి మనసుకి ఏమీ తెలియదు. ఈ మనసుకు ఈ ప్రపంచంలోని వాటి గురించే తెలుసు.

ప్రారంభంలో తల్లిదండ్రుల ప్రభావం ఈ మనసుపై పడుతుంది. చిన్న పిల్లలప్పుడు ఏది మనసులో పడితే చచ్చేదాకా అదే ఉంటుంది. ఏ కుటుంబంలో పుడితే! ఆ కుటుంబమే తనదనుకుంటుంది. ఏ కులంలో పుడితే! ఆ కులమే నాదనుకుంటుంది. ఎవరు చెప్తారు? ఏ కులం? ఏ మతం? అనేది. తల్లీ తండ్రి చెప్తారు. ఆ బిడ్డ తల్లినే పూర్తిగా అనుసరిస్తుంది.

మనది ఈ కులము, మనది ఈ మతము అని నేర్పిస్తుంది. హిందువులు అయితే చిన్నప్పటి నుంచి గుడికి తీసుకెళ్లి ఆ విగ్రహాన్ని చూపించి, ఈయనే మన దేవుడు అని చెప్తుంది. నీకు ఏదైనా కష్టం వస్తే ఇలా రెండు చేతులు దగ్గరికి పెట్టి, దండం పెట్టి, ఆయన్ని ప్రార్థిస్తే నీ కష్టాలన్నీ ఆయన తీరుస్తాడు అని నేర్పిస్తుంది. అదే క్రీస్టియన్లైతే చర్చికి తీసుకెళ్తారు. ఆ ప్రభువే దేవుడు, నీకు కష్టం వస్తే ఆయన్ని ప్రార్థించు అని చెప్తారు. అదే ముస్లింలైతే మసీదుకి తీసుకెళ్తారు. మరి రోజూ అలా ట్రైనింగ్ ఇస్తే అలా కాక ఎలా తయారవుతారు?

నేను ఈ మతము, ఈ కులము, ఈ కుటుంబము, అనేటువంటి అభిప్రాయాలు బలంగా వారిలో నాటుకుపోతాయి. పత్రిగారి లాంటి గురువు వచ్చి నువ్వు శరీరం కాదు, ఆత్మ అని చెప్పినా వినరు. మన క్లాస్‌కు వచ్చిన వారిని మీరు ఎవరంటే? ఆత్మ అంటారు, కానీ క్లాప్ అయిపోయాక దేహం అన్నట్టుగా జీవిస్తారు.

పూర్తిగా ఈ ప్రపంచం ఇలాగే ఉంటుంది అన్నట్టుగా జీవిస్తారు.

పోనీ ఇదేమన్నా నిజమైన ప్రపంచమా? మాయా ప్రపంచం. అంటే వున్నట్టుగా ఉంటుంది కానీ వుండదు, లేనిది ఉన్నట్టుగా కనిపిస్తుంది. చిన్నప్పటి నుండి నేను, నాది అని వేటి గురించి ఫిక్స్ అయిపోతారో అవి చచ్చేదాకా వదలరు. ఈ నేను, నాది వదిలే దాకా నేను ఆత్మను అన్నది తెలీదు, దుఃఖం పోదు.

అందుకే పత్రి గారు ఏం చెప్పారంటే? 'నామా' లు తీసేయండి అన్నారు. నామాలు అంటే "నాది, మాది" తీసేయండి అన్నారు. మా అబ్బాయి, మా అమ్మాయి, నా పెళ్ళాం, నా మొగుడు. ఇంతకీ వీళ్లు ఎవరు? ఆత్మలు. ఈ దేహం నేను అనుకున్న వాళ్ళకి ఈ నామాలు ఉంటాయి. నామాలు తీస్తే కానీ ఆత్మస్థితి రాదు. నా ఆస్తి, నా సంపదలు ఇవన్నీ వుంటాయి.

నామాలు ఎందుకు తీసేయాలి అంటే? అవి తీసేస్తేనే ఆత్మలా జీవిస్తావు, ఆత్మస్థితిని పొందుతావు, అప్పుడే నీకు మోక్షం. ఆత్మస్థితిలో వుండడం అంటే? నువ్వు ఏం చేసినా, ఏం మాట్లాడినా, ఆత్మ అన్నట్టుగానే ఉండాలి. ఎప్పుడూ ఆత్మకు లాభించే పనులే చేయాలి, ఎప్పుడూ ఆత్మ అన్నట్టుగా జీవించాలి, అప్పుడే నామాలు వదిలినట్టు.

అసలు 'నామా'లు ఈ మాయా ప్రపంచంలో ఎక్కడున్నాయండి? మనసు ఎంతసేపు ఏమంటుంది? లేనివన్నీ వున్నాయంటుంది, అవే కావాలంటుంది. ఉండే ఆత్మ గురించి దానికి తెలియదు. మనసు కావాలనుకున్నవన్నీ కూడా లేనివే, వుండనివే. వుండేది ఆత్మ. అది మాత్రం మనసుకు తెలీదు.

మనసుకు నిత్యమైన ఆత్మ గురించి తెలీదు, అనిత్యమైన ప్రపంచం గురించే తెలుసు. అందుకే శంకరాచార్యుల వారు ఏమన్నారు అంటే? జ్ఞానం పొందాలంటే ముందు 'నిత్య, అనిత్య వస్తు వివేకం' కావాలి అన్నారు. ఎవరికైనా సరే ముందు ఈ వివేకం ఉండాలి. మనసు ప్రభావం ఎంతకాలం ఉంటుందో, అంతకాలం అనిత్యమైన వాటి వెనకాలే ఉంటారు. ఆ

భ్రాంతిలోనే ఉంటారు. ఎప్పుడైతే మనసు ప్రభావం తగ్గుతుందో నిత్యమైన ఆత్మ గురించి తెలుసుకుంటారు. ఇప్పుడు మనమంతా ఆ పనే చేస్తున్నాం.

అందుచేత పైలోకాల నుంచి భూమి మీదకి వచ్చినపుడు ఆత్మ లాభం కోసమే నిర్ణయించుకుని వస్తాం. వచ్చి అన్నీ మరిచిపోయి ఆత్మ గురించి గానీ, ఆత్మ లాభం గురించి గానీ ఏమీ చెయ్యం, అసలు పట్టించుకోము. చాలామంది అసలు ఆత్మ అనేది ఉందా? అని అడుగుతారు. అలా జీవితకాలం జీవించినా ఆత్మను పట్టించుకోని వారిని "ఆత్మ హంతకులు" అంటారు.

పత్రిగారి లాంటి వాళ్లు భూమి మీదకి వచ్చినప్పుడు, ఈ దేహం నేను కాదు, నేను ఆత్మని అని తెలుసుకుంటారు.

ఆత్మ గురించి తెలుసుకోవడమే స్పిరిచువాలిటీ. ఆత్మ గురించి మీరు తెలుసుకుంటున్నారు అంటే! మీరు స్పిరిచువాలిటీలోకి వచ్చినట్టే. కానీ విచిత్రం ఏమిటంటే? చాలా మంది ఈ స్పిరిచువాలిటీలోకి వచ్చినా కూడా సిక్ అయిపోతారు. వాళ్ళు కొన్నాళ్ళు ధ్యానం చేస్తారు. మరల మానేస్తారు. తెలిసినా కూడా జ్ఞానం సంపాదించుకోరు.

శరీర పరంగా సిక్ అయితే హాస్పిటల్లో జాయిన్ అయ్యి ఏమి చేయలేరు, అది ఫిజికల్ గా సిక్ అవ్వడం. అలాగే ఈ ఆధ్యాత్మికంలోకి వచ్చి కూడా సిక్ అయ్యేవారు వుంటారు, వాళ్ళని స్పిరిచువల్‌గా సిక్ అయ్యారు అంటారు. దాన్ని స్పిరిచువల్ సిక్నెస్ అంటారు. అంటే ఆధ్యాత్మిక అనారోగ్యం అంటారు. వారు ఆత్మలాభం గురించి ఆలోచించరు.

# ఆత్మ హంతకులు కాకండి

మనం యోగీశ్వరుల సందేశాలు ఎన్నో సార్లు చెప్పుకుంటున్నాం. అవి సామాన్యమైనవి కావు, ఎంతో ఆలోచించవలసినవి,  విచారణ చేస్తూ అర్థం చేసుకోవలసినవి. ఊరికే విని వదిలి పెట్టేవి కావు, కాలక్షేపం కోసం వినేవి కావు.

మనందరి జీవితంలో విలువైన క్షణాలు ఏమైనా ఉన్నాయి అంటే? అవి ఈ జూమ్ కార్యక్రమంలో గడిపే క్షణాలు.

అందుచేత మనం **"ఆత్మహంతకులు కాకూడదు".**

అంటే జీవితకాలం జీవించినా ఆత్మను పట్టించుకోనివాడు, ఆత్మ గురించి ఏమీ చేయనివాడు, ఆత్మ లాభం కోసం ఆలోచించనివాడు, అసలు ఆత్మ అనేది ఉందన్న సంగతి ఎరుగనివాడు, వాడు భూమిమీద ఎన్ని గొప్ప పనులు చేసినా, ఎన్ని సాధించినా వాడు "ఆత్మహంతకుడు" అవుతాడని యోగీశ్వరులు చెప్పడం జరిగింది.

అలా మన జీవితంలో ఆత్మ గురించి ఏమైనా చేస్తున్నాము అంటే? మనం ఉదయం పూట పాల్గొనే ఈ జూమ్, తరువాత భీమవరంలో పాల్గొనే ఆ మూడు రోజుల శిక్షణా శిబిరం. మిగతా సమయం అంతా ఆత్మ గురించి ఏమీ చెయ్యకపోతే వృధాయే.

ఆత్మ కార్యాలు చేస్తున్న మనల్ని చూసేవాళ్ళు... వీళ్ళు సమయమంతా వృధా చేస్తున్నారు, పనికి రాని పనులు చేస్తున్నారు అనుకుంటారు. కానీ మిగతా వాళ్ళు చేసేవే పనికిరాని పనులు అని వారు జీవించి వుండగా తెలియదు కానీ చనిపోయిన తర్వాత తెలుస్తుంది.

చాలా మంది ఏవేవో చేసి,  ఏవేవో సాధించి, చాలా గొప్ప పనులు చేసేమని పొంగిపోతూ ఉంటారు. అలాగే కొంతమంది భూమ్మీద కోట్లు సంపాదిస్తారు, పెద్ద పెద్ద పదవులు సంపాదిస్తారు, గొప్పగా

చదువుతారు, ఐఏఎస్ లు, ఐపిఎస్ లు చేస్తారు. ఇవన్నీ సాధించి అహంకారంతో విర్రవీగుతారు, నన్ను మించిన వాడు ఎవడూ లేడు, నేనే గొప్ప కార్యం చేస్తున్నాను, గొప్ప పని చేస్తున్నాను అని ఎంతో గర్విస్తారు, అహంకరిస్తారు కూడా!

కానీ విచిత్రం ఏంటంటే? చనిపోయిన తర్వాత వీరి జీవితమంతా కష్టపడి సాధించినవి కానీ, సంపాదించుకున్నవి కానీ, పొందినవి కానీ, ఈ అవార్డులు కాని, అవి ఏవైనా సరే ఒక్కటీ ఉపయోగపడదు, కూడా రావు. ఆత్మ ఒక్కటే పైకి వెళ్తుంది. నేను అనుకునే ఆ శరీరాన్ని కాల్చేస్తారు. అప్పుడు వాడికి మతి వుండదు, ఇంత గొప్పవాడిని అయ్యాను, ఇన్ని గొప్ప పనులు చేశాను, ఇన్ని వేల మంది కంటే నేనే గొప్పవాడిని అని భావిస్తే! ఆ కోట్లు రాలేదు, ఆ పదవులు రాలేదు, ఆ అవార్డులు రాలేదు, రివార్డులు రాలేదు, ఏవీ కూడా రాలేదేమిటి? అని ఆశ్చర్యపోతాడు!

ఏంటి ఈ జీవితంలో నేను చేసింది, కష్టపడింది అంతా వృధాయేనా? అని ఎంతో ఫీల్ అవుతాడు, ఆశ్చర్యపోతాడు. ఇంతకీ ఆ కాల్చేసిన  దేహం నేను కాదా? కాని అదే నేనని పొంగిపోయాను. ఎంతో సుఖపడ్డాను అని అనుకున్నాను! పిల్లలతో, చుట్టాలతో ఎంతో గొప్ప జీవితం జీవించానని అనుకున్నాను. కానీ అవన్నీ అక్కడే ఉండిపోయాయే! అని బాధపడతాడు.

అలా పైకి వెళ్ళాక ఆలోచిస్తాడు. ఎంత పిచ్చోడినయ్యాను నేను! రాని వాటి కోసం రాత్రీ, పగలూ కష్టపడ్డానే, ఏదేదో సాధించానని పొంగిపోయానే, గొప్పవాడినని గర్వించానే, అందులో ఒక్కటి కూడా ఇప్పుడు లేవే! అసలు ఇంతకీ నాకు లాభించే పని ఏం చేశాను? ఒక్కటైనా చేశానా? అని ఆలోచిస్తాడు. కానీ తనకు అంటే ఆత్మకు లాభించేవి ఒక్కటీ కనిపించదు.

కారణం అప్పటిదాకా దేహమే తాను అనుకున్నాడు. ఇప్పుడు క్లియర్ గా తెలుసుకున్నాడు, దేహం నేను కాదు, దేహం కోసం చేసినవన్నీ

దండగ, దేహం కోసం వెచ్చించిన సమయమంతా వృధా అని అర్థం చేసుకుంటాడు. నేను జీవించి ఉన్నప్పుడు ఎవరైనా ధ్యానం చేస్తూ ఉంటే, కళ్ళు మూసుకుని కూర్చుంటే, ఏంటి పిచ్చోళ్ళలా ఉన్నారు? మాట్లాడితే కళ్ళు మూసుకుంటారు? ఏదో పని చేసుకోవచ్చుగా? అనుకున్నాను. కానీ నేనే పిచ్చోడిలా సమయం అంతా వృధా చేశాను అనేది అర్థం చేసుకుంటాడు.

ఎవరైనా పిల్లలు ధ్యానం చేస్తుంటే  కొంతమంది తల్లిదండ్రులు వాళ్లని ఎంతసేపు కళ్ళు మూసుకుంటావు? చదువుకోవచ్చుగా, మంచి ర్యాంక్ సంపాదించు కోవచ్చుగా, మంచి ఉద్యోగం సంపాదించుకోవచ్చుగా, బాగా సంపాదించి సుఖపడొచ్చుగా అంటారు. ధ్యానాన్ని ఎంకరేజ్ చెయ్యరు. వాళ్ళు చదువుకుని మంచి ఉద్యోగం చేస్తే వాడు గొప్ప పని చేస్తున్నట్టు ఫీల్ అవుతారు.

కాని శరీరం వదిలాక అరే వాళ్ళని విమర్శించానే, తప్పు చేస్తున్నారు అనుకున్నానే, పిచ్చోళ్ళు అనుకున్నానే, వాళ్ళు కళ్ళు మూసుకుని కూర్చుంటే నేను చేసేదే గొప్ప పని అనుకున్నానే! అంటే వాళ్ళు చేసేదే సరైనదేనన్నమాట. నేను చేసిందే పిచ్చి పని అని అప్పుడు అర్థమవుతుంది. ఆశ్చర్యపోతాడు! ఎంత తెలివి తక్కువతనం, నేను ఆత్మ అన్న సంగతి ఎవడూ నాకు చెప్పలేదే! అని అనుకుంటాడు.

ఎవరికైనా మనలాంటోళ్ళు  నువ్వు దేహం కాదురా బాబు నువ్వు ఆత్మవి అని చెప్తే, నేను ఐఏఎస్ చదివాను, నువ్వు నాకు చెప్పేది ఏంటి? అంటాడు. నేను డాక్టర్ చదివి, స్పెషలైజేషన్ కూడా చేశాను. నాకు తెలియంది ఏముంది అంటారు. నేను గొప్ప పండితుడిని కొన్ని వేల మందికి ఉప న్యాసాలు ఇస్తున్నాను నాకు నువ్వు చెప్పేది ఏంటి? అంటాడు. నేను మినిస్టర్ ని, నువ్వు సామాన్యుడివి, నువ్వు నాకేం చెప్తావ్? అంటాడు. ఈ పిచ్చోళ్ళంతా శరీరం వదిలి పైకి వెళ్లాక అనుకుంటారు. అవును! వాళ్ళు చెప్పారు, నేనే వాళ్ళు పిచ్చోళ్ళు అనుకున్నాను, కానీ అసలు పిచ్చోడిని నేనే

అని అప్పుడు అర్థమవుతుంది.

డబ్బు సంపాదించకుండా, భోగాలు అనుభవించకుండా, సామాన్య జీవితం గడిపితే అది జీవితమా? వాళ్ళకంటే పిచ్చోళ్ళు ఎవరైనా ఉన్నారా? అని భూమ్మీద ఉన్నప్పుడు అనుకుంటారు. కచ్చితంగా మన అందరినీ చూసి ఇతరులలో ఇలాంటి భావాలే ఉంటాయి. మన బంధువులకు, మన కుటింబీకులకు ఏం తెలుసు? మనం చేస్తున్న పని.

మొన్న మా మనవడి వివాహమైంది. దానికోసం ఒకటి రెండు సార్లు వెళ్ళవల్సి వచ్చింది. ఊరికే అక్కడ వాళ్ళకి కనిపించి అందరూ ఫంక్షన్ లో వున్నప్పుడు నేను అక్కడ గదిలోకి వెళ్ళిపోతాను. ఇంచక్క నాకు సెల్ వుంది, సెల్ లో కరక్షన్ చేసుకోవాల్సిన పుస్తకాలు ఎన్నో ఉన్నాయి వాటిని కరెక్ట్ చేసుకుంటాను. వాళ్ళకి నేను వచ్చినట్టుగా కనిపిస్తుంది. కానీ నేను ఏం చేస్తానంటే? ఇంటిదగ్గర చేసుకునేది అక్కడ చేసుకుంటాను. ఆ సంగతి వాళ్ళకి తెలీదు. వాళ్ళ గోల వాళ్ళది, నా గోల నాది.

పెళ్లి పేరు చెప్పి నేను ఎందుకు రెండు, మూడు రోజులు వృధా చేయాలి? నా సమయాన్ని వృధా చేయకూడదు. ఎలాగైనా నాకు బోరు కొట్టినప్పుడు, ఈ పని చేసేటప్పుడు కాసేపు రిలాక్స్ అవుతాను. ఒకటే గుర్తుపెట్టుకోండి ఆత్మజ్ఞాని ప్రాపంచిక కార్యాల కోసం తన సమయాన్ని వృధా చేయడు, ఆత్మ కార్యాలే చేస్తాడు, ఆత్మకు లాభించే పనులే చేస్తాడు.

మనలో చాలామంది వాళ్ళ బంధువుల ఇంట్లో ఏదైనా పెళ్ళి వస్తే దూరపు బంధువులైనా సరే ఓ 15 రోజులో, నెల రోజులో ఈ పనులన్నిటికీ సెలవు పెట్టేస్తారు. ఏంటి అని మనం అడిగితే? మా చెల్లెలి కూతురి పెళ్లండి, మా అన్నయ్య కొడుకు పెళ్లండి అందుచేత రాలేక పోయానండి అంటారు. అంటే ఇంకా వీళ్ళు ఈ మార్గంలోకి వచ్చినా తాను చేసే పని ఎంత గొప్పదో అర్థం చేసుకోలేదనే లెఖ్ఖ.

వినగా వినగా అర్థమౌతుందనుకోండి. ఇటువంటి సందేశాలు

వింటూ ఉంటే కచ్చితంగా మార్పు వస్తుంది. అందుచేత గుర్తుపెట్టుకోండి మీరు ఒక జీవితకాలం జీవించి కూడా ఆత్మను పట్టించుకోకపోతే, ఆత్మ కోసం ఏమీ చేయకపోతే, ఆత్మ లాభాన్ని నిర్లక్ష్యం చేస్తే, నువ్వు కచ్చితంగా **'ఆత్మహంతకుడివే.'**

ఇది ఇప్పుడు చెప్పినా అర్థం కాదు. చాలామంది రోజూ ప్రొద్దున్నో గంట, సాయంత్రం గంట కూర్చుంటున్నాం కదండీ అంటారు. వీడు కూర్చునేది ఆత్మ కోసమా? దేహం కోసమా? ఆలోచన ఉండదు. అందుకే సాంగత్యం ఉండాలంటాను. సజ్జన సాంగత్యం అంటే సత్యం గురించి చెప్పగలిగిన వారి సాంగత్యం. సత్యము అంటే ఆత్మ, ఆత్మ గురించి, ఆత్మ లాభం గురించి, ఆత్మ ఉన్నతి గురించి, ఆత్మ ఎదుగుదల గురించి, ఆత్మకు ఊర్ధ్వలోక ప్రాప్తి గురించి ఎవరైతే చెప్పగలరో వారి సాంగత్యమే సజ్జన సాంగత్యం. కాలక్షేపం కబుర్లు చెప్పుకోవడమన్నది సజ్జన సాంగత్యం కాదు.

అందుచేత మనం 'ఆత్మహంతకులు' కాకూడదు. మీరు చూడండి ఎంత ఆఫీసర్ అయినా, ఎన్ని గొప్ప పనులు చేస్తున్నా, ఎంత మినిస్టర్ అయినా, వాడికి ఏదో యాక్సిడెంట్ అయ్యి కాలేదో విరుగుతుంది. లేకపోతే ఇంకోటి ఏదో అవుతుంది. ఓ నెలో, రెండు నెలలో, మూడు నెలలో, దేహానికి సంబంధించిన పనులు చెయ్యరు. అలాంటి వారిని సిక్ అయ్యాడు అంటారు.

అలాగే మీరు కూడా ఏదో వంక పెట్టి ఆ పెళ్లి అనో, ఆ ఫంక్షననో, ఆ కార్యక్రమం అనో, ఈ ధ్యాన,జ్ఞాన కార్యక్రమాలు మీరు ఎగ్గొట్టారు అనుకోండి మీరు ఆధ్యాత్మికంగా సిక్ అయినట్టు. ఒక నెలో, రెండు నెలలో వదిలేస్తారు. ఇలా చాలామంది ఉన్నారు. ముందు వదిలేస్తారు, తర్వాత ఎప్పుడో జాయిన్ అవుతారు. ఎందుకోనండి అంటూ ఓ 15 రోజులకి, మూడు నెలలకు, ఆరు నెలలకు జాయిన్ అయ్యేవాళ్ళు కూడా వున్నారు.

ఇంకా హాస్పిటల్‌కి వెళ్ళినోళ్ళు వారం రోజులు వుంటారు,

కొంతమంది నెల రోజులు వుంటారు, ఆరు మాసాలు వుంటారు. ఎప్పుడూ ఆరోగ్యంగా ఉండి అన్ని పనులూ చేసుకునే వాడిని పర్ఫెక్ట్ హెల్త్ అంటారు. ఎప్పుడూ నాగా లేకుండా ఈ ఆత్మ లాభం కలిగించే పనులు చేసేవాళ్ళని స్పిరిచువల్ హెల్త్ అంటారు. ఆధ్యాత్మిక ఆరోగ్యం పూర్తిగా ఉన్నవాడు బ్రేక్ ఇస్తే ఆధ్యాత్మికంగా సిక్ అయినవాడు అంటారు. మీరు ఏ స్థితిలో వున్నారో మీరు గ్రహించుకోండి.

కొంతమంది అనుకుంటారు మార్నింగ్ జూమ్‌లోకి ఇన్ని సంవత్సరాల నుంచి వస్తున్నాను ఇంకేంటి వచ్చేది? ఏముంది? అనుకుంటారు. పిచ్చోడు! ఇన్ని సంవత్సరాల నుంచి వస్తున్నాడు కనీసం కొద్దిగా అయినా జ్ఞానం సంపాదించుకున్నానా? అని ఆలోచించడు. ఆయన ఇన్ని విషయాలు చెప్తున్నారు, ఇందులో నేను ఏమన్నా ఆచరిస్తున్నానా? అదీ వుండదు.

ఇంకెందుకు నేను రావడం అనుకుంటాడు. ఇన్ని సంవత్సరాలు వెళ్లాను? సరిపోతుంది కదా ? అని అంటూ ఉంటారు. ఏంటి సరిపోయేది? వీడేదో బుద్ధుడు అయిపోయినట్టు, ఓ వివేకానంద అయిపోయినట్టు, లేకపోతే ఓ శంకరాచార్యులు అయిపోయినట్టు. అందుచేత ఆధ్యాత్మికంగా సిక్ అవ్వకండి. ఆత్మ హంతకులు అస్సలు కాకండి.

# యోగీశ్వరుడు అంటే ?

యోగీశ్వరుడు అంటే సామాన్యమైనవాడు కాదు. చాలా గొప్ప స్థితికి ఎదిగినవాడు. అలా ఎదిగిన వారిని శ్రీకృష్ణుల వారు పండితుడు అని పేర్కొన్నాడు. పండితుడు అంటే జ్ఞానంలో పండినవాడు, మానవులందరి కంటే గొప్పవాడు, సమస్తము తెలిసి ఉన్నవాడు, సమస్త జ్ఞానము అవపోసన పట్టి ఉన్నవాడు. అటువంటి వాడిని యోగీశ్వరుడు అంటారు. అటువంటి యోగీశ్వరుడిని శ్రీకృష్ణుల వారు పండితుడు అని పేర్కొన్నారు.

యోగేశ్వరుడు ఎంత గొప్పవాడంటే ఒకసారి వైజాగ్ దగ్గర అరకు ప్రాంతానికి పత్రి గారితో నేను, మేడం ఇద్దరం కలిసి ట్రెకింగ్ వెళ్ళడం జరిగింది. ఒక సందర్భంలో నేను పత్రిజీ ఒక్కరి తోటే నడుస్తున్నాను. ఆ సందర్భంలో పత్రిగారితో మీరు గొప్ప యోగులు అనుకుంటున్నానండి అన్నాను.

అప్పుడు ఆయన నేను యోగి కాదయ్యా... యోగీశ్వరుడిని అన్నారు, అలా నా మాటను సరిచేశారు. అప్పటిదాకా యోగే గొప్పవాడు అని అనుకున్నాను. కానీ పత్రి గారు ఆ మాట చెప్పాక అర్థమైంది, యోగులందరి లోనూ గొప్పవాడే యోగేశ్వరుడు అని. ఆయన ఆ మాట అన్నాక ఆయన స్థాయి ఏంటో నాకు అర్థమైంది.

సహజంగా ఎవరికి వాళ్ళు తన గొప్పతనం చెప్పుకోరు. కాని నా అభిప్రాయం సరైంది కాదు అన్నది నాకు వివరించడానికే పత్రి గారు ఆ మాట చెప్పారు. అప్పుడు ఆయన మీద ఇంకా గౌరవం పెరిగింది, ఆయన చెప్పే వాటి మీద ఇంకా శ్రద్ధ పెట్టాను.

అలా ఆయన మాట నాలో ఎంతో పరివర్తన తీసుకువచ్చింది, ఆయన మీద భక్తిని పెంచింది, ఆయన చెప్పే వాటి మీద శ్రద్ధ పెంచింది. ఆ ఒక్క మాటతో నా సాధన తీవ్రతరమైంది, నా ప్రాపంచిక విషయాల

మీద ఆసక్తి తగ్గింది. ఆ ఒక్క మాట నాలో ఇన్ని రకాల మార్పులు తీసుకు వచ్చింది.

ఇదంతా ఆధ్యాత్మికంగా ఎదగడానికి ఎంతో ఉపయోగపడింది. అందుచేత యోగీశ్వరుల యొక్క సందేశాలు మనం చెప్పుకుంటున్నాం కాబట్టి యోగీశ్వరుడు ఎంత గొప్పవాడో మనం తెలుసుకోవాలి. వశిష్టుల వారు అవ్వనివ్వండి, వ్యాసుల వారు అవ్వనివ్వండి, బుద్ధుడు అవ్వనివ్వండి, కృష్ణుడు అవ్వనివ్వండి, పత్రి గారు అవ్వనివ్వండి అటువంటి గొప్పవారి యొక్క గొప్పతనం కొద్దిపాటి జ్ఞానం ఉన్నవారికే అర్థం అవుతుంది.

జ్ఞానం లేని వాడికి వారిలో లోపాలే కనిపిస్తాయి, లోపాలు చూస్తుంటే యోగీశ్వరుడు కూడా సామాన్యుడి క్రిందే వాళ్ళకి కనిపిస్తాడు. కాని వాళ్ళ గొప్పతనం అర్థం చేసుకుంటే వాళ్ళు ఎంత గొప్పవాళ్ళో, ఎంత గొప్ప స్థితిలో ఉన్నారో అన్నది అర్థమవుతుంది. యోగీశ్వరుడు అంటే అనంతమైన జ్ఞానం కలిగినవాడు, అపారమైన బుద్ధి కలిగినవాడు. వారి జ్ఞానం అనంతం. వారిలోని జ్ఞానం వారిలో నుంచి అలా వస్తూనే వుంటుంది.

వారు ఎన్ని చెప్తున్నా ఇంకా కొత్తవి వస్తూ వుంటాయి, కొత్త కోణాల్లో వస్తాయి. దాన్నే అనంత జ్ఞానం అంటారు. వారికి ఏ మాట పట్టుకున్నా అదో సబ్జెక్ట్ అయిపోతుంది. నేను అందుకే పత్రిగారు వున్నప్పుడు కంపల్సరీగా జేబులో నోట్బుక్, పెన్ను రెండు వుంచుకునేవాడ్ని. ఎక్కడ, ఏ మాట ఆయన దగ్గర నుంచి కొత్తది వచ్చినా వెంటనే నోట్ చేసుకునే వాడిని.

ఇంచుమించు అలాంటి నోట్ బుక్స్ 100 పైనే ఉన్నాయి. నేను పుస్తకాలు వ్రాసేటప్పుడు ఈ నోట్ బుక్స్ అన్నీ ఒకసారి తిరగేసాను. వాటిలోని పాయింట్లన్నీ నోట్ చేసుకున్నాను. నేను వ్రాసిన పుస్తకాలలో చాలా టాపిక్స్ వున్నాయి.

ఆయన సింపుల్ గా చెప్తారు. అందులో ఒకటో, రెండో పాయింట్లు తీసుకొని ఒక టాపిక్ తయారు చేసేవాడిని. ఆయన ఇచ్చిన ఒక పాయింటు పట్టుకొని, దానికి ఉదాహరణలు చెపుతూ, ఉపమానాలు చెప్తూ, వివరణ ఇస్తూ ఉంటే అదే ఒక టాపిక్ అయ్యేది. అందుకే నా పుస్తకాలలోని టాపిక్స్ రెండు, మూడు పేజీలు మించి ఉండవు.

నువ్వు ఎన్ని చేసినా, ఏం చేసినా, ఏం సంపాదించినా, ఏం కూడబెట్టినా, నువ్వు శరీరం వదిలిపెట్టినప్పుడు అన్నీ వదిలిపెట్టి వెళ్లాల్సిందే. కాని నువ్వు సంపాదించుకున్న జ్ఞానమే నీకు కూడా వస్తుందని తెలుసుకోవాలి.

పత్రిగారు చెప్పినట్టు యోగీశ్వరుడు అన్నా, కృష్ణుడు చెప్పినట్టు పండితుడు అన్నా, బుద్ధుడు చెప్పినట్టు ఉత్తమ పురుషుడు అన్నా ఒకటే.


## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

**a)** ప్రతిరోజూ ఉదయం **Zoom** లో **4 to 6.30 a.m. Silence Meditation** మరియు **6.30 to 7.30 a.m.** వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

**Zoom I.D. :2413823868, Password : RAO**

**b)** పై కార్యక్రమము **6.30 to 7.30 a.m.** వరకు **Youtube**లో కూడా **Live** ఇవ్వబడుతుంది.

**c)** ఎవరైతే **TVR & TRL Whatsapp** గ్రూపులో వుంటారో వారికి **Zoom Link & You Tube Links** మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా **save** చేసుకోవాలి.

**d)** తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే **www.tst.org.in Open** చేసిన తర్వాత **Join in Whatsapp group** లింక్ మీద నొక్కండి.

# వ్యాస భగవానుడు

**"బ్రహ్మాది దేవతలందరూ వారి వారి అర్హతకు తగిన విధంగా, తరతమ భేదాలతో ఆ పరబ్రహ్మ స్వరూపమైన ఆనంద సాగరం నుండే అనుభవిస్తున్నారని తెలుసుకోవాలి".**

దీని నుంచి కొన్ని విషయాలు మనం అర్థం చేసుకోవాలి. బ్రహ్మాది దేవతలందరూ అంటే ఈ దేవుళ్ళు, దేవతల అందరు వారి వారి అర్హతను బట్టే ఆనంద సాగరమైన ఆ పరబ్రహ్మ నుంచే అనుభవిస్తున్నారని చెప్పడం జరిగింది.

సాగరం అంత ఆనందమే ఆ పరబ్రహ్మ స్వరూపం. ఇక్కడ గ్రహించవలసింది బ్రహ్మాది దేవతల కంటే కూడా పరబ్రహ్మ చాలా గొప్ప వాడు అని మనం తెలుసుకోవాలి. ఇది ఉపనిషత్తులో చెప్పబడినటువంటి సందేశం.

సహజంగా మానవులకు ఉండే అభిప్రాయం దేవతలు, దేవుళ్ళు గొప్పవారని. కానీ వాళ్లకు ఉన్నటువంటి శక్తులు కానీ, జ్ఞానం కానీ, వాళ్ళు పొందే ఆనందం కానీ, వాళ్ళ అర్హతను బట్టి ఆ పరబ్రహ్మ నుంచి పొందినవే. దీన్ని బట్టి పరబ్రహ్మ ఎంత గొప్ప వాడో తెలుసుకోవచ్చు.

ఆయన్నే సచ్చిదానంద స్వరూపుడు అని కూడా అంటారు, సృష్టికర్త అంటారు, విశ్వాత్మ అంటారు, పరమాత్మ అంటారు, పరబ్రహ్మ అంటారు. అలా ఎన్నో పేర్లతో పిలుస్తారు. సృష్టిని సృష్టి చేసినవాడు, సృష్టికి ఆధారమైనవాడు, సృష్టిని నడిపిస్తున్నవాడు, అంతటి గొప్పవాడు. ఆయన దగ్గర లేనిదంటూ ఏదీ లేదు. అలా ఎవరు ఎంత ఆనందం పొందుతూ

వుంటారో, అనుభవిస్తూ వుంటారో, ఆ ఆనందం సాక్షాత్తు పరబ్రహ్మ నుంచి వచ్చిందే!

'ఆత్మే పరబ్రహ్మ' అని పత్రి గారు మనకి స్పష్టంగా చెప్పారు. సమస్త జీవరాశుల్లో ఉన్నటువంటి ఆత్మే ఆ పరబ్రహ్మ అన్న సంగతి కూడా తెలుసుకోవాలి. అంటే మన అందరి శరీరాల్లో ఉన్నటువంటి ఆత్మే అంత గొప్పవాడైన పరబ్రహ్మ. ఆ ఆత్మే ఆనంద సాగరం.

అంతటి ఆనందం ప్రతి ఒక్కరి శరీరంలో ఉంది. అంత ఆనందం శరీరంలో వుంచుకొని మానవులు ఎప్పుడూ దుఃఖపడుతూ ఉంటారు, బాధపడుతూ ఉంటారు, ఏడుస్తూ ఉంటారు, అశాంతికి లోనౌతూ ఉంటారు, ఎందుకు ఈ జీవితం అనుకుంటూ ఉంటారు. ఏంత విచిత్రం ?

వీళ్ళు కోరుకున్న ఆనందం శరీరంలో ఉన్నా, అనంతంగా వున్నా, అది అనుభవించలేకపోతున్నారు, దుఃఖమే అనుభవిస్తున్నారు. ఉపనిషత్తులో వారి వారి అర్హతను బట్టి అని చెప్పబడింది. అంటే ఒకరికి ఎక్కువ ఉ ంటుంది, ఒకరికి తక్కువ ఉంటుంది. సాగరంలో నీటికి కరువేముంది. అలాగే పరబ్రహ్మ దగ్గర ఆనందానికి కరువేంటి?

నువ్వు సముద్రం దగ్గరికి ఎంత పాత్ర పట్టుకెళ్తే అంత నీరు తెచ్చుకుంటావు. ఒక గ్లాసు పట్టుకెళ్తే గ్లాసుడు నీరు తెచ్చుకుంటావు, బిందె పట్టుకెళ్తే బిందెడు, ఓ డ్రమ్ పట్టుకెళ్తే డ్రమ్ముడు, ఓ ట్యాంకర్ పట్టుకెళ్తే ట్యాంకర్ సముద్రం నీరు తెచ్చుకోవచ్చు. నువ్వు పట్టుకెళ్లే పాత్రాన్ని బట్టి ఉంటుంది. నువ్వు ఎంత పట్టుకు వెళ్ళినా సముద్రం తరగదు, ఎంతైనా పొందొచ్చు.

మరి శరీరంలో ఉన్న అంత గొప్ప ఆనందం ఎలా పొందాలి? ఆ ఆనందం పొందే మార్గమే మన పత్రి గారు మనకు అందించిన “శ్వాస మీద ధ్యాస” ధ్యానం. ఎవరైతే ఈ ధ్యానం చేస్తారో! వారికి ముందు ఆలోచనలన్నీ ఆగిపోతాయి, చంచలంగా ఉన్న మనసు నిశ్చలమైపోతుంది.

ఇంకా సాధన కొనసాగిస్తూ ఉంటే నిశ్చలమైన మనసు నిర్మలం అవుతుంది అంటే శుద్ధి అవుతుంది అంటే మంచిగా మారుతుంది.

మీరు ఇంకా ధ్యానం కొనసాగిస్తూ ఉంటే నిర్మలమైన మనసు శూన్యం అవుతూ వుంటుంది. ఎప్పుడైతే మనసు శూన్యం అవుతూ వుంటుందో ఆనంద సాగరం నుంచి మీకు ఆనందం అందుతూ ఉంటుంది, అంటే ఆనందాన్ని అనుభవిస్తూ వుంటారు. మనసుని ఎంత శూన్యం చేసుకుంటారో అంత ఆనందాన్ని మీరు పొందగలుగుతారు, అనుభవించ గలుగుతారు.

ఇక్కడ అర్హత ఎలా వచ్చింది అంటే? వాళ్ళు చేసే సాధనను బట్టి. కొంతమంది ఎక్కువ చేయొచ్చు, కొంతమంది తక్కువ చేయొచ్చు. ఎక్కువ చేసిన వాడికి ఎక్కువ ఆనందం వస్తుంది, తక్కువ చేసిన వాడికి తక్కువ ఆనందం వస్తుంది. ఎవరికైనా వారి, వారి కృషినిబట్టి ఆనందం పొందే అర్హత ఉంది.

అందుచేత జీవితం అన్నది దుఃఖ పడడానికి కాదు, బాధపడడానికి కాదు, తన శరీరంలో ఉన్నటువంటి ఆనంద సాగరం నుంచి ఆనందం అనుభవించటానికి, అందుచేత ఆ ఆనందాన్ని పొందే ప్రయత్నం చేయాలి.

అందుకే బాలయోగులు అంత సాధన చేస్తూ, ఆనందాన్ని అనుభవిస్తూ బయటికి రాలేక సంవత్సరాలు తరబడి వుండిపోతారు. వాళ్ళని సామాన్యులు పిచ్చోళ్ళు అనుకుంటారు, కాని వాళ్ళని పిచ్చోళ్ళు అనుకున్న వాళ్లే పిచ్చోళ్ళు. వాళ్ళు పొందుతున్న ఆనందం వీళ్ళకెక్కడుంది. వీళ్ళు దుఃఖపడుతూ వాళ్ళు పిచ్చోళ్లు అనుకుంటారు. వీరు ఈ ప్రపంచంలో వుండే అల్ప సంతోషం కోసం అనంతమైన దుఃఖాన్ని అనుభవిస్తున్నారు.

అసలు ఆనందం అంటే ఏమిటో కూడా వాళ్ళకి తెలీదు. మొన్న క్లాసులో మనవాళ్ళు కొంతమంది రాత్రి రాత్రంతా ధ్యానంలో కూర్చున్నారు. ఎలా కూర్చోగలిగారు ఆ ఆనందాన్ని అనుభూతి చెందుతూ వుండడం

వల్ల. ఆనందం లేకుండా దుఃఖం ఉంటే ఎలా కూర్చుంటారు? ఆ స్థితికి వెళ్ళని వాళ్ళు, ఆ ఆనందాన్ని పొందని వాళ్ళు ధ్యానంలో కళ్ళు తెరిచేస్తారు, లేచిపోతారు, నా వల్ల కావట్లేదు అంటారు.

కానీ ఆ స్థితికి చేరుకున్నవారికి, ఆనందాన్ని అనుభవిస్తున్న వారికి గంటలు కూడా నిమిషాల్లా గడిచిపోతాయి. వాళ్ళు మర్నాడు కూర్చోమంటే మర్నాడు కూడా కూర్చున్నారు. ఇప్పుడు చాలా మంది అలా కూర్చోడానికి సిద్ధపడ్డారు.

అలాగే ఆ పరబ్రహ్మ నుంచి ఎంత ఆనందాన్ని తీసుకున్నా, అది తరగదు. అందుకే కొంతమందిని చూడండి చిరంజీవులు అంటారు అంటే వాళ్ళు వందలు సంవత్సరాలు, కాదు, వేల సంవత్సరాల నుంచి శరీరంతో ఉండిపోయారు. కానీ వాళ్ళు శరీరంతో తిరగరు, ఆ స్థితిలో వుండిపోతారు. ఆ ఆనంద సాగరంలో ఎన్ని వేల సంవత్సరాలు అయిందో కూడా వాళ్ళకి తెలీదు.

ఆంజనేయ స్వామిని చూడండి, మహావతార్ బాబాజీ లాంటి వారంతా చిరంజీవులుగా అలాగే జీవిస్తున్నారు. అలాగే శివుడు కూడా ఎప్పుడూ ధ్యానస్థితిలో ఉంటాడు. అనంతంగా ఉన్నటువంటి ఆ జ్ఞానాన్ని, ఆ ఆనందాన్ని ఆయన అలా గ్రోలుకుంటూనే ఉంటాడు. మనం కూడా అద్భుతమైన ఈ మార్గంలోకి వచ్చాం. ఇది అర్థం చేసుకొని మీ సాధన పెంచుకోండి. కానీ కళ్ళు తెరిచి జీవిస్తే అంతా దుఃఖమే.

అందుచేత కళ్ళు మూయడమే కాదు, మనసు కూడా మూస్తే మీరు ఉండేది ఆనంద సాగరంలో అని తెలుసుకొండి. ఆ మనసు మూసే ప్రక్రియే పత్రీజీ బోధించిన " శ్వాస మీద ధ్యాస ధ్యానం".

ఆ పనే భీమవరం వచ్చేవాళ్లందరూ చేస్తున్నారు. నేను అందుకే చెపుతాను 350 జన్మలు దాటకపోతే అంత ఆసక్తి చూపించలేరు. అలాగే ప్రతి నెలా రాలేరు, ఇన్ని గంటలు కూర్చోలేరు. కాని ప్రాపంచిక స్థితిలో

వుంటే అశాంతి, దుఃఖము, సమస్యలు, బాధలు, కష్టాలు అన్ని ఉంటాయి. కాని ధ్యాన స్థితిలో ఉంటే గనుక ఎప్పుడూ అనుభవించని ఆనందం అనుభవిస్తారు.

మానవులు ప్రపంచంలో ఉన్న వాటినుంచి పొందేది సంతోషం మాత్రమే తప్ప, ఆనందం కాదు. ఆనందం అన్నది పరబ్రహ్మ నుంచే పొందాలి. ఆ అర్హత చేసే సాధనను బట్టి, సాధన యొక్క తీవ్రతను బట్టి వస్తుంది.

నేను పత్రిగారిని గమనించాను. ఈయన ఇంత గొప్పవాడు ఎందుకు అయ్యాడు? ఎందుకు ఆయనకి ఇంత క్రేజ్ వచ్చింది? ఎందుకు ఇంతమంది ఆయన అంటే ఎగబడుతున్నారు? అని. అప్పుడు నాకు అర్థమైంది, ఆయన ఆనందాన్ని పొందే మార్గాన్ని ప్రపంచవ్యాప్తంగా బోధించాడు కాబట్టి.

మనం చెప్పుకుంటూ వుంటాం సుఖం, సంతోషం, ఆనందం అని. అంటే శరీరం నుంచి పొందేది సుఖము, మనసు నుంచి పొందేది సంతోషము, ఆత్మ నుంచి పొందేదే ఆనందమని.

అలా ఎవరు బోధిస్తే వారు గొప్పవాళ్ళు కాగలుగుతారు. మనమూ బోధిస్తే, మనమూ ఎందుకు గొప్పవాళ్ళు కాలేమని, దాన్నే నేను పట్టుకున్నాను.

చూడండి పూర్వకాలం నుంచి చాలా గుళ్ళల్లో సెక్స్ బొమ్మలు చూస్తూ వుంటాం. ఏంటి గుళ్ళ మీద సెక్స్ బొమ్మలు వేశారు అని చాలామంది ఇలా వేశారేంటి అని అనుకోవడం కూడా ఉంది.

ఇంకెక్కడ లేనట్టు పవిత్రమైన గుళ్ళ మీద వేసారేంటి! అనుకుంటారు, కానీ దానికి చాలా అంతరార్థం ఉంది. మానవుడు జీవితంలో ఉదయం నుంచి కష్టపడి రాత్రి చీకటిపడిన తరువాత తన భాగస్వామితో సంభోగించే సమయంలో ఆనందం పొందుతారు. ఆ

ఆనందం మామూలు ఆనందం కాదు, అది అనిర్వచనీయమైన, అంటే వర్ణించలేనిది, చెప్పడానికి సాధ్యం కానంత గొప్పది ఆ ఆనందం.

అందుకే భార్యని భర్త వదలలేడు, భర్తని భార్య వదలలేదు. దెబ్బలాడుకున్నా మళ్ళీ కలిసిపోతారు. దేనికోసము అంటే? ఆ ఆనందాన్ని అనుభవించడం కోసం. విచిత్రం ఏంటంటే? అది క్షణకాలమే ఉంటుంది. ఆ క్షణకాల ఆనందం కోసం పగలంతా ఒకరికోసం ఇంకొకరు ఎంతో కష్టపడతారు, దేనికి అంటే? ఆ క్షణకాలం పొందే సంభోగ ఆనందం కోసం, అంత గొప్పది ఆ ఆనందం.

ఓషో మహాశయుడు ఏమంటాడంటే? నువ్వు సంభోగంలో క్షణకాలం పొందే ఆనందం ఎలాంటిదో! ఆ పరబ్రహ్మ అంటే ఆత్మను పొందితే అటువంటి ఆనందం శాశ్వతంగా ఉంటుంది అన్నాడు. మానవులకు ఈ విషయం తెలియక, సంభోగం కోసం ప్రయత్నిస్తున్నారు కాని, భగవంతుని పొందే ప్రయత్నం చెయ్యడం లేదు.

ఎందుచేతనంటే? ఆత్మను అంటే భగవంతుని పొందినవాడు, ఈ లోకంలో ఇంక ఏదీ అక్కర్లేదు అంటాడు. ఆ ఆనందం సాగరం లాంటిది, అనంతమైనది, ఆ ఆనందం ప్రతి ఒక్కరి శరీరంలో ఉంది. ఎవరైనా ఆ ఆనందం పొందాలంటే శరీరంలోనికి వెళ్ళాలి. శారీరకమైన సుఖాలు, శారీరకమైన భోగాలు, ఎన్ని అనుభవించినా దానికి సరిపోదు.

అందుకే ఓషో ఏమంటాడంటే? బయట శారీరక పరమైన సంభోగంతో ఉండిపోకు, లోపలికి వెళ్ళి భగవంతుని పొందే ప్రయత్నం చెయ్యి అంటారు. అదే గుళ్ల మీద ఆ బూతు బొమ్మలు వేయడానికి కారణం.

వాటి ఉద్దేశ్యం, గుడికి వెళ్ళినవాడు బయట ఉన్నటువంటి బొమ్మలు చూస్తూ, అక్కడే వుండిపోకుండా, లోపలికి వెళ్ళి ఆ భగవంతుని దర్శించు అని చెప్పడమే ఆ బూతు బొమ్మల సందేశం. అందుకే పూర్వ కాలంలో పెద్దలు గుళ్ళ మీద అలా బొమ్మలు ఏర్పాటు చేయడం జరిగింది.

మానవులే కాదు, మహాత్ములే కాదు, యోగులే కాదు, ఋషులే కాదు, బ్రహ్మాది దేవతలందరూ కూడా, దేవుళ్ళతో సహా, వారి వారి అర్హతను బట్టి, అర్హతకు తగిన విధంగా, తరతమ భేదాలతో ఆ పరబ్రహ్మ స్వరూపమైన ఆనంద సాగరం నుండే అనుభవిస్తున్నారు అని తెలుసుకోవాలని ఉప నిషత్తులలో చెప్పబడింది. ఇది అర్థమైనవారు మిగతావన్నీ ప్రక్కన పెడతారు. భగవంతుని పొందడానికే ప్రాముఖ్యం ఇస్తారు.

పత్రిగారు ఈ ఆనంద మార్గాన్ని లోకానికి బోధించాడు కాబట్టే ఆయన అంత గొప్పవాడయ్యాడు. అదే నేను తెలుసుకున్నాను, అదే బోధిస్తున్నాను. నా శక్తి మేరకు, అవకాశం ఉన్నంతవరకు ఎంతమందికి ఇది అందించగలమో అంతమందికి అందించాలన్నదే నా ఆశయం.

ఎవరైనా సరే ఈ పని చేస్తే చాలా గొప్పవాడు అవుతాడు. ఇంతకన్నా గొప్ప సేవ లేదు, ఇంతకన్నా గొప్ప మార్గం లేదు. అందుకే మీరు చూడండి ఈ గైడింగ్లు, మ్యూజిక్లు, మెల్లిమెల్లిగా తగ్గిపోతాయి. చివరికి "శ్వాస మీద ధ్యాసే" నిలబడతుంది. ఈ గైడింగ్ చేసినా, మ్యూజిక్ చేసినా మనసు నుంచే మీరు పొందగలరు.

మనసు దగ్గర ఏముంది? అశాంతి ఉంటుంది అంతేకాని ఆనంద సాగరం ఎక్కడ ఉంది? ఆనందం ఆత్మ దగ్గర ఉంది. అది మనసు దాటాలి, అంటే మనసు ముయ్యాలి. అందుచేత ఆ పని "శ్వాస మీద ధ్యాస" వల్ల మాత్రమే సాధ్యం. "శ్వాస మీద ధ్యాస" చేసినపుడు, ఆ ఆనందాన్ని అనుభూతి చెందుతాం. మీకు ఆ రుచి తెలిస్తే, మీరు ధ్యానం వదలమన్నా వదలరు. ఊరికే మీరు కళ్ళు మూసుకుని మనసు దగ్గర ఆగిపోతే కొన్నాళ్ళకి ధ్యానం చేయలేరు. కానీ "శ్వాస మీద ధ్యాస" పెట్టి ఆ స్థితికి మీరు వెళ్ళ గలిగి ఆ ఆనందం అనుభవించ గలిగితే, నాకు ఈ ప్రపంచంలో ఇంకేమీ అక్కరలేదు అంటారు.

# "వశిష్టుల వారు"

**"యధాయాతి తధా యాతి, యద్గచ్ఛతి తద్గచ్ఛతి"**

దీని తాత్పర్యం ఏమిటంటే? "వచ్చేది వస్తుంది, పోయేది పోతుంది."

వశిష్టులవారు వచ్చే దాని గురించే కాదు, పోయే దాని గురించి కూడా చెప్పారు. ఇక్కడ వశిష్టుల వారు సృష్టిని అవపోసన పట్టినవారు. సృష్టి సిద్ధాంతాలు, సృష్టి ధర్మాలు, సృష్టి నియమాలు, సృష్టిలో వున్న సమస్తమూ తెలుసున్నవారు, వాళ్ళ అనుభవ జ్ఞానంతో బోధించినదే ఈ సందేశం.

ఆయన ఏమన్నారంటే **"వచ్చేది వస్తుంది, పోయేది పోతుంది"** అన్నారు.

గుర్తుపెట్టుకోండి వచ్చే దాని గురించి ఎందుకు అరాట పడతారు. అది సంపాదించాలని, ఇది పోగేసుకోవాలని, ఇది కట్టాలని, వాడికి వుంది నాకు లేదని, ఎందుకు ఈ గొడవ అంతా? వాడికి ఉంది రైటే. వాడికి వుంటే నీకు రావాలని ఉందా? నువ్వు రాత్రి పగలు కష్టపడితే వచ్చేస్తుందా? ఎక్కడి నుంచి వస్తుంది?

నీకు అర్హత ఉంటే కోటీశ్వరుడి కొడుకుగా పుట్టేవాడివి, లేకపోతే ఒక కూతురిగా పుట్టేదానివి. ఇలా ఎందుకు పుడతావు? ఇది తెలుసుకోవాలి. మరి ఇప్పుడు నన్ను ఏం చేయమంటారని అడగొచ్చు. కాని నువ్వు చేయవలసింది చేయి. ముందు నువ్వు ఎవరో తెలుసుకో! నీ లక్ష్యం ఏంటో తెలుసుకో! నీ గమ్యం ఏంటో తెలుసుకో! వాటిని సాధించే ప్రయత్నం చెయ్యి.

నీకు ఏమైనా రావాల్సి ఉంటే అది ఎప్పుడురావాలో, ఏది రావాలో అప్పుడే అది వస్తుంది, నువ్వు అడగవలసిన పనిలేదు, నువ్వు కోరవలసిన పనిలేదు, ప్రయత్నించక్కర్లేదు, కష్టపడక్కర్లేదు, శ్రమ పడక్కర్లేదు, ఆటోమేటిక్

గా ఆ సమయానికి వచ్చేస్తుంది. నువ్వు ఎందుకు ఆందోళన పడతావు?

వశిష్ఠుల వారు చెప్పారు అంటే సామాన్యమా? నీకు రావల్సి లేకపోతే. క్రిందా, మీదా పడినా రానే రాదు. అందుచేతే రావడం కోసం ఆందోళన పడకూడదు.

దానికోసం నీ సమయం వృధా చేయకు, నీ జీవితాన్ని, నీ సమయాన్ని, నీ శక్తిని, నీ తెలివిని, నీ మేదస్సుని, ఎందుకు వృదా చేసుకుంటావు? రావాలని ఎందుకు ఆరాటపడతావు? వచ్చేదైతే వస్తుంది. నువ్వు ఆరాట పడకపోయినా, నువ్వు శ్రమ పడకపోయినా, నువ్వు ప్రయత్నించకపోయినా, నీకు రావల్సింది ఏదో ఒక రూపంలో, ఏదో రకంగా వస్తుంది.

వశిష్ఠులవారు స్పష్టంగా చెప్పారుగా "యధాయాతి తధా యాతి" అని అంటే "వచ్చేది వస్తుంది" అని.

అందుచేత వచ్చే దాని గురించి ఎందుకు ప్రయత్నం చేస్తారు? అనుకున్నది రాకపోతే ఎందుకు బాధపడతారు? రాకపోతే ఎంత అశాంతి? ఇదంతా ఎందుకు జరిగింది ? నీకు వచ్చే అర్హత లేదు, ఎలా వస్తుంది? చివరికి బాధ వస్తుంది తప్ప, అనుకున్నది మట్టుకు రాదు. వశిష్టులవారి ఒక్క మాటలో ఎంత అర్ధం ఉంది చూడండి.

మీరు ఈ వాక్యం చదివినప్పుడు మామూలుగా తీసుకుంటారు. కానీ ఇందులో ఎంతో అర్థం ఉంది. ఈ వాక్యంలో సృష్టి నియమం ఇమిడి వుంది. అసలు జీవితం నీ చేతుల్లో ఎక్కడ ఉంది? అంతా సృష్టి నిర్ణయం ప్రకారమే జరుగుతుంది. ఆలోచించు ఎన్నో కోట్ల మంది మేధావులు, అపర మేధావులు భూమిమీద నుంచి నిష్క్రమించారు.

నీవైనా ఎన్నాళ్ళు ఉంటావు? ఉండడం అంటే నీ అన్ని ఇంద్రియాలు శక్తివంతంగా పని చేసినంతసేపే నువ్వు భూమి మీద వున్నట్టు. నీ ఇంద్రియాలు శక్తి కోల్పోతూ ఉంటే నువ్వు భూమి మీద వున్నా

నిష్క్రమించినట్టే! గుర్తుపెట్టుకోండి ప్రతి ఒక్కరు భూమిమీద పర్మనెంట్‌గా వుంటారు, ఇంకా ఎదేదో చేసేస్తారని అనుకోకండి.

మానవ జీవితం మామూలు జీవితం కాదండి. భుక్తిని చూసుకోవాలి, సంసారాన్ని చూసుకోవాలి, సమాజంలో ఉన్నటువంటి కొన్ని నియమాలు పాటించాలి, నువ్వు ఎవరో తెలుసుకోవాలి, నీ లక్ష్యం ఏంటో తెలుసుకోవాలి. ఇన్ని రకాల ప్రయత్నం చేయాలి. ప్రాపంచిక బాధ్యతలు చూసుకుంటూ మీ లక్ష్యాన్ని సాధించాలి. ఇవన్నీ అంత తేలిక కాదు, ఎంతో సమయం ఉందని అనుకుంటారు. ఎక్కడఉంది?

నా జీవితం ఒకసారి వెనక్కి తిరగేస్తే, పత్రి గారి పరిచయం అయ్యి 22 ఏళ్ళు పైన అయింది. ఆలోచిస్తే అప్పుడే 22 ఏళ్ళ అయిపోయిందా? అని ఆశ్చర్యమేస్తుంది. పత్రి గారు పరిచయం అయినప్పుడు మా మనవలు మా చంకల్లో ఉన్నారు. ఇప్పుడు వాళ్ళ చంకల్లోకి వారి పిల్లలు వచ్చేసారు. ఆలోచిస్తే చాలా విచిత్రంగా అనిపిస్తుంది, చంకల్లో వుండే వాళ్ళకే చంకల్లో పిల్లలు వచ్చేసారు.

నా లైఫ్‌లో చూస్తూ వుండగానే మనవళ్ళకు కూడా పిల్లలు వచ్చారు అంటే ముని మనవళ్ళు. ఎంత మార్పు? అశ్చర్య మేస్తుంది! మా జీవితంలోనే ఎన్ని జనరేషన్స్ మారిపోయాయి? అందుచేత ఎవరైనా నిష్క్రమించవలసిందే! ఎందుకు వూరికే ఆరాటం? నువ్వు ఏమి రావాలని అనుకుంటున్నావో! అవేమీ ఉండేవి కావు. ఉండేవి కాని వాటిని ఎందుకు రావాలనుకుంటావు?

పోనీ వుండేవైతే ఆశ పడు, వర్రీ పడు, కష్టపడు, జీవితం వెచ్చించు, అన్నీ చెయ్యి. కానీ దేనికోసం ఆరాటపడుతున్నావు? అందుకే వశిష్టుల వారు 'వచ్చేది వస్తుంది' అన్నారు. ఎందుకు దాని గురించి ఆలోచన? ఈ ప్రపంచంలో ఆకర్షణీయమైనవి ఎన్నో ఉంటాయి.

వాటి గొడవ నీకు ఎందుకు? నువ్వు చేయవలసిన దాని మీద నీ దృష్టి పెట్టు, నువ్వు సాధించవలసిన దాని మీద దృష్టి పెట్టు, నువ్వు

సంపాదించుకోవల్సిన దాని మీద దృష్టి పెట్టు. అసలు నువ్వు ఎవరు? నీకు ఏం కావాలో ఆలోచించు?

వశిష్టులవారు ఇంకా ఏమన్నారంటే? "యద్గచ్ఛతి తద్గచ్ఛతి" అంటే "పోయేది పోతుంది" అన్నారు. భలే చెప్పారు "వచ్చేది వస్తుంది, పోయేది పోతుంది" అన్నారు.

పత్రి గారు ఏమన్నారంటే "వస్తే రాని, వుంటే వుండనీ, పోతే పోనీ" అన్నారు. ఇంచుమించు వశిష్ఠుల వారు చెప్పింది, పత్రి గారు చెప్పింది ఒకటే. **"వస్తే రాని, వుంటే వుండనీ, పోతే పోనీ"**

అసలు ఎందుకు వచ్చిందో కారణం నీకు తెలీదు. ఎందుకు వుందో కూడా కారణం నీకు తెలీదు. ఎందుకు పోతుందో కూడా కారణం నీకు తెలీదు. మరి ఇవన్నీ ఎందుకు తెలుసుకోవాలి? అంటే ఎప్పుడూ సంతోషంగా, ఆనందంగా జీవించడానికి. కాబట్టి డబ్బు సంపాదన కోసమే జీవించట్లేదని తెలుసుకోండి.


## తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) జ్ఞానమాల | - | రూ.70/- |
| 3) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 4)మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 5) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 6) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 7) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్:9440309812,

# సదానందయోగి ఏమన్నారంటే?

**"కోరి సాధించ రాదు, కోరక వచ్చింది కాదన రాదు, వస్తూ వుంటే వస్తుందని సంబర పడరాదు, పోతూ వుంటే పోతుందని బాధపడరాదు"** అన్నారు.

వశిష్టుల వారు చేసిన బోధ కూడా అదే.

అందుచేత రావాలని కోరకూడదు, పోతుందని భాధపడ కూడదు. ఎందుచేతనంటే? పత్రీజీ ఏమన్నారంటే కోరడం వల్ల ప్రయోజనం లేదు అని చెప్తూ జీవితంలో ఏ పరిస్థితుల్లోనూ కోరితే రాదు అని మూడు కారణాలు చెప్పారు.

1.ఎవరికైనా సరే **"ప్రారంభ జన్మల్లో కోరితే రాదు, అర్హతను బట్టి వస్తుంది"** అన్నారు. నీకు అర్హత యవ్వనంలో వచ్చింది అనుకో, యవ్వనంలో నీకు కలిసి వస్తుంది. అంతకుముందు తిండికి కూడా వుండకపోవచ్చు, అర్హత వచ్చింది, ఇప్పుడు ఏ లోటు లేదు. ఇక్కడ అర్హత అన్నది గత జన్మల్లో చేసుకుంటేనే వస్తుంది అనే అభిప్రాయం చాలామందిలో ఉంటుంది. ఈ జన్మలో చేసుకున్నా కూడా అర్హత సంపాదించుకునే అవకాశం ఉందని తెలుసుకొండి.

ఈ విషయం చాలా మందికి అర్థం కాదు. నేను ఎంతో మందిని చూశాను. ఈస్ట్ గోదావరి, మాచవరంలో రమణ అని ఉండేవాడు, ప్రారంభంలో ఇంచుమించు 2004-2005 ప్రాంతంలో మండపేటలో ధ్యానులు ఎవ్వరు ఉండేవారు కాదు. అప్పుడు రమణ ఇంట్లో ఉండి వారం రోజులు తిరగాలనుకున్నాను.

కాని వాడి ఇంట్లో ఏమీలేవు, ఒక్క గది. ఆ గదిలోనే నేల మీద దుప్పటివేసి దాని మీద పడుకోమన్నాడు. ఏం చేయను సరే అని నాలుగైదు రోజులు అక్కడే ఉన్నాను.

ఇంట్లో సామాన్లు కూడా ఏమీలేవు. వాడి పరిస్థితి అది. విచిత్రం ఏంటంటే? రోజుకి రెండు, మూడు క్లాసులు పెట్టాడు. మొత్తం 24 క్లాసులు ప్రతి పల్లెటూరులో చెప్పాను.

కానీ వాడు అలా నిరంతరాయంగా ప్రచారం చేస్తూనే ఉన్నాడు.

వాడు తిన్నా తినకపోయినా, వున్నా లేకపోయినా, చేస్తూనే వున్నాడు. ఒక నాలుగేళ్ళు పోయేసరికి ఎందుకో తెలీదు వాడు హైదరాబాద్ వెళ్ళాడు. అక్కడ ఏదో చిన్న షాపు రెంట్‌కు తీసుకుని చిన్న బట్టల షాపు పెట్టాడు.

తర్వాత తెలిసింది ఆ బట్టల కొట్టులో కలిసి వచ్చినట్టుంది వాడికి, స్టాక్ బాగా పెరిగింది, బాగా సంపాదించాడు, షాపు బాగా పెద్దది చేశాడు. గుమాస్థాను మెయింటైన్ చేసే స్థాయికి వచ్చాడు. ఆశ్చర్యపోయాను ఎలా వుండేవాడు ఏ స్థాయికి వచ్చాడు అని.

ఒకసారి సూరత్ వెళ్ళి 4, 5 లక్షలు కాష్ ఇచ్చి బట్టలు కొన్నాడు. ఆశ్చర్యం వేసింది, అరే ఎంత సంపాదించాడు వీడు అని. అబ్బాయినేమో ఇంజనీరింగ్ చదివించాడు, అమ్మాయిని కూడా మంచి చదువు చదివించాడు, ఇంట్లో ఫర్నిచర్ కొనుక్కున్నాడు. ఇవన్నీ చూసి ఎలా వుండే వాడు ఎలా అయిపోయాడు అనుకున్నాను. ఆలోచించాను, అప్పుడు అర్థమైంది వాడు చేసిన సేవే అర్హత సంపాదించి పెట్టి ఆ స్థాయికి వచ్చాడు అని అర్థమైంది.

ఓహో అలా ఐతే ఈ జన్మలో చేసుకున్నా కూడా ఆర్థిక స్థితి మార్చుకోవచ్చు అన్నది అర్థమైంది.

నాకు 2002 నవంబర్లో పత్రిగారి పరిచయం అయ్యింది. ఆ టైమ్‌లో కొద్దిగా వ్యాపారంలో దెబ్బలు తగలడం మొదలు పెట్టాయి. లాస్ అన్నది ఎరగని వాడ్ని, లాస్‌లో పడ్డా. ఏంటి పరిస్థితి ఇలా అయిపోయింది అనుకున్నాను.

ఆ టైంలో ఎందుకో తెలీదు పత్రిగారికి చాలా ఆకర్షితుడినయ్యాను. ఆయన చెప్పే జ్ఞానం నాకు బాగా నచ్చింది. అప్పుడే ఈ వ్యాపారాలు మానేయడం, ఈ కార్యక్రమాలకి తిరగడం మొదలు పెట్టడం జరిగింది.

అలా 10 ఏళ్ళు గడిచాయి, నాలో ఏ మార్పూ లేదు, చాలా ఇబ్బంది పడ్డాను. పైకి మట్టుకు మామూలుగానే ఉండేవాడ్ని. మూడు రోజుల క్లాస్లు స్టార్ట్ చేశాను. దాన్నికూడా ఏమీ లెక్క చేయకుండా నిర్వహించాను. అలా ఈ మార్గంలో చాలా సేవ చేశాను. 2013 వచ్చేటప్పటికి మళ్ళీ అర్హత పెరిగింది. ఆర్థిక పరిస్థితి పెరిగింది.

అయినా నేనేమి ప్రచారం మానలేదు. పుస్తకాలు కూడా వ్రాసేవాడిని. ఊరూరు తిరుగుతూ క్లాసులు కంటిన్యూ చేశాను. ఈ చేసిన సేవ ఫలితం 2013 లో కనిపించింది. అంతకుముందు ఏం చేద్దామన్నా కలిసి వచ్చేది కాదు. కానీ అప్పుడు అనుకోకుండా ప్రతిదీ కలిసి వచ్చింది.

వ్యాపారం లేకపోయినా బిల్డింగులు కట్టాను. రెంట్స్ వచ్చేవి, ఆ రెంట్స్ తో మళ్లా కట్టాను. మళ్లా రెంట్స్ పెరిగేవి, అలా చాలా బిల్డింగ్స్ వేశాను. కానీ ప్రచారం ఆపలేదు. 10 సంవత్సరాలు చేసిన సేవా ఫలితమే పరిస్థితి మారడానికి కారణం అని తెలుసుకున్నాను.

అంటే అంతకుముందు అర్హతను బట్టి ఎంతవరకు రావాలో అంతవరకు వచ్చింది. కానీ నా ప్రణాళిక అది కాదు అందుచేత నాకు కావలసింది అది కాదు, అందుకే దెబ్బ తిన్నా. అప్పుడు **"నాకు కోరింది రాలేదు, కావలసిందే వచ్చింది".** నాకు కావలసింది డబ్బు కాదు, జ్ఞానం, అందుకే జ్ఞాన మార్గంలోకి వచ్చాను.

అందుకే పత్రిగారు పరిచయం అయ్యారు. నా భార్య కూడా ఈ మార్గంలోకి వచ్చి ఎంతో సహకరించింది.

అలాగే శ్రీకాంత్ కూడా ఏమీ లేకపోయినా తను చేసే పనుల వల్ల అర్హత సంపాదించాడు. తినడానికి కూడా వుండేది కాదు, ఎక్కడ భోజనం పెడతారంటే అక్కడికి వెళ్లి తిని వచ్చేవాడు.

అంత హీనంగా ఉండేవాడు, అలాంటివాడిని ధ్యాన ప్రచారం చేయరా అది గొప్ప సేవ అని చెప్తే చేశాడు. మరి దాని ఫలితమే ఆర్థిక స్థితి బాగా పెంచుకున్నాడు. వాడికి పెళ్ళి సంబంధం చూసేటప్పుడు కూడా సరైన ఆర్థిక స్థితి లేదు. కానీ చేసిన దాని ఫలితం ఊరికే పోదు. వాడి ఆర్థిక స్థితి ఎంతో మారింది.

అలాగే మధు కూడా కట్టుబట్టలతో హైదరాబాద్ వచ్చాడు, పైసా జేబులో ఉండేది కాదు. కాని ఈ మార్గంలో చేసే సేవ వల్ల నిలవలోకి వచ్చాడు.

మీరు ఆశ్చర్యపోతారు. నాకు అర్థమైంది వాళ్లు చేసే సేవా ఫలితమే వారి పరిస్థితి మారడానికి కారణం. ఇలా ఇంకా ఎంతో మందిని చూశాను, అందుకే అంటారు, నువ్వు **"చేసేది చేస్తూ ఉంటే వచ్చేది వస్తుందని".** అదే

మనం నేర్చుకోవాల్సింది. అంతేకాని ఏమీ చెయ్యకుండా కోరినా, ఆశపడినా రాదు, కష్టపడినా రాదు, ఆరాటపడినా రాదు, ఏం చేసినా రాదు. అందుచేత అర్హత సంపాదించుకుంటే కచ్చితంగా వస్తుంది.

అలాగే పోయేది కూడా పోతుంది. చాలామంది సంపాదించు కుంటారు. సంపాదించుకున్నది మళ్లా పోతూంటుంది. ఎంతో బాధపడిపోతారు. వచ్చింది పోయింది అని కూడా అనుకోరు, బాధపడిపోతారు. పోవాల్సింది వుంది పోయింది. దాని గురించి ఆలోచిస్తావెందుకు. పోవడానికి కారణం వుంటుంది, రావడానికి కారణం వుంటుంది. అంతా నడిపించే ప్రకృతికి తెలుస్తుంది.

అందుచేతే "వస్తుందని సంబరపడకూడదు, పోతుందని బాధ పడకూడదు" అదే 'సదానంద యోగి' చెప్పింది. ఆయన "కోరి సాధించరాదు, కోరక వస్తూ వుంటే కాదనరాదు" అన్నారు.

పత్రి గారిని కూడా గమనించాను. ఎవ్వరు ఏది ఇచ్చినా ఆయన చేసే కార్యక్రమాలకి ఖర్చు పెట్టేస్తారు, అది ఆయనలో ఉన్న గొప్పతనం. ఆయనకి ఎంతో మంది బట్టలు ఇస్తూ ఉంటారు. మరల ఆయన తిరిగి వాళ్ళకీ, వీళ్ళకీ ఇచ్చేస్తూ ఉంటారు. ఎవరైనా స్వీట్ ప్యాకెట్ పట్టుకొస్తే అక్కడే పంచేస్తారు. ఇప్పుడు మేమూ అదే నేర్చుకుంటున్నాం. అందుచేత ధనమే కాదు, జ్ఞానమైనా ఇస్తూ ఉంటే వస్తూ ఉంటుంది. అందుకే మిమ్మల్ని ఇవ్వమనే చెప్తున్నాను.

అందుచేత టైం వృధా చేయకండి, ఎంజాయ్ చేయడానికి ఉప యోగించకండి. మీ శక్తులన్నీ అంటే మాట్లాడే శక్తి, చూసే శక్తి, వినే శక్తి, పని చేసే శక్తి, అద్భుతమైన జ్ఞానాన్ని ఇవ్వడానికి ఉపయోగించండి. జ్ఞానం కంటా గొప్పది లేదు, ఆ పనే ఇప్పుడు మీరంతా చేస్తున్నారు. ఆ చెప్పడంలో మీరు ఇంకా నైపుణ్యం సంపాదించాలనే స్పిరిచువల్ రీసెర్చ్ వర్క్ షాప్ పెట్టాము.

మామూలుగా రొటీన్‌గా చెప్పడం కాదు అందులో ఇంకా నైపుణ్యం పెంచుకోవాలి. ఏదో పుస్తకం చదివి చెప్పడం కాదు, దాంట్లో ఉన్న ప్రతి పదానికి అర్థం చెప్పాలి, ఉదాహరణలతో, ఉపమానాలతో అర్థమయ్యేటట్లు చెప్పాలి. మీరందరూ బాగా తయారవ్వాలనే నా ఆకాంక్ష .

# మహమ్మద్ ప్రవక్త

**"మన జ్ఞాన ధనాన్ని పగలు భోజనం అనే దొంగ, రాత్రి నిద్ర అనే దొంగ అలా ఇద్దరు దొంగలు దోచుకుంటున్నారు."**

ధనం రెండు రకాలు. 1. ప్రాపంచిక ధనం, 2. ఆధ్యాత్మిక ధనం.

ప్రాపంచిక ధనం భోగాలు అంటే సుఖాలను ఇస్తుంది. కాని ఆధ్యాత్మిక ధనం అంటే జ్ఞానధనం దుఃఖాన్ని నివారిస్తుంది, దుఃఖం రాకుండా చేస్తుంది.

ప్రాపంచిక ధనంతో మంచి మేడ కట్టుకోవచ్చు, మంచి డెకరేషన్ చేయొచ్చు, కార్లు కొనొచ్చు, ఏసీలు పెట్టుకోవచ్చు, ఇలా ఎన్నో చేయొచ్చు, వీటివల్ల సుఖాలు అనుభవించవచ్చు. అందుకే మానవుడు ప్రాపంచిక ధనాన్ని కోరుకుంటాడు.

కానీ ఎంత డబ్బు ఉన్నా, ఎన్ని సుఖాలు ఉన్నా మానవునికి దుఃఖం ఉండకూడదు, అంటే సమస్యలు, కష్టాలు ఉండకూడదు. అదే అసలైన జీవితం. అంతేకాని ఆరోగ్య సమస్యలు ఉన్నా, ఆర్థిక సమస్యలు ఉన్నా, భార్యా భర్తల మధ్యలో గొడవలు ఉన్నా, కుటుంబంలో సమస్యలు ఉన్నా, ఇరుగు పొరుగు వారితో సమస్యలు ఉన్నా, ముసలితనంలో సమస్యలు ఉన్నా జీవితం దుర్భర మవుతుంది.

మరి అలాంటి దుఃఖం కలగకూడదు అంటే జ్ఞానధనం సంపాదించుకోవాలి. ఆ పనే ఇప్పుడు మనమంతా చేస్తున్నాం. ఇంచుమించు 300 నుంచి 350 మంది ఉదయం 4 గంటలకు లేచి జూమ్ లో జాయిన్ అవుతున్నారు. ఇంతమంది ప్రతిరోజు పాల్గొనడానికి కారణం జ్ఞాన ధనాన్ని సంపాదించుకోవడానికే. గుర్తుంచుకోండి లోకంలో జ్ఞానధనం ఉన్నవాడే గొప్పవాడు, వాడికున్న విలువ, గౌరవం ఎవ్వరికీ ఉండదు. అందుకే చూడండి పత్రి గారు అంటే అందరూ ఎంత అభిమానిస్తారు? ఎంత గౌరవిస్తారు? ఆయన ఎక్కడికి వెళ్ళినా బ్రహ్మరథం పడతారు.

చూడడానికి ఆయన అందరిలాగే ఉంటాడు. కాని అందరూ ఆయన్ని ఎందుకు గౌరవిస్తున్నారు? అంటే ఆయన దగ్గర అపారమైన జ్ఞానధనం వుంది. అటువంటి జ్ఞాన ధనాన్నే ఇప్పుడు మనమంతా సంపాదించుకుంటున్నాం. ఈ జ్ఞానధనం ఉన్నవాళ్ళకి ధనం లేకపోయినా, వారు ఎక్కడికి వెళ్ళినా మంచి గౌరవం, ఆదరణ లభిస్తుంది. ఏ ఊరు వెళ్ళినా వారికి ఏ లోటు లేకుండా చూసుకుంటారు.

కాని ప్రాపంచిక ధనం ఎంత ఉన్నా, ఎన్ని కోట్లు వున్నా ఎవరూ పట్టించుకోరు. వాడు ఏ వూరు వెళ్ళినా వాడి తిండి, వసతి, ఏర్పాట్లు వాడే చూసుకోవాలి.

కానీ జ్ఞానధనం ఉన్న పత్రి గారు వస్తే ఆయనకి ఎకామిడేషన్ ఇచ్చి, ఆయనకి కావలసిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారంటే? ఆయన దగ్గర ఉన్నటువంటి జ్ఞానధనమే కారణం. గుర్తుపెట్టుకోండి జ్ఞానధనం అంత గొప్పది.

మహమ్మద్ ప్రవక్త ఏమన్నారంటే? మామూలు ధనాన్ని దోచుకోవడానికి దొంగలు ఎలా ఉంటారో! ఈ జ్ఞాన ధనాన్ని దోచుకునే ఇద్దరు దొంగలు ఉన్నారన్నారు. మానవులు అజాగ్రత్తగా ఉంటే ఈ ఇద్దరు దొంగలు వారి జ్ఞానధనాన్ని దొంగిలిస్తారని అన్నారు.

మీరు బాగా డబ్బు సంపాదించి జేబుల నిండా పెట్టుకెళ్ళండి, ఎవడో ఒకడు కొట్టేస్తాడు. జేబుదొంగలు ఎప్పుడూ కాసుకుని కూర్చుంటారు. అలాగే మన జ్ఞానధనాన్ని దోచుకోవడానికి పగలు భోజనం అనే దొంగ, రాత్రి నిద్ర అనే దొంగ వున్నారట. చూడండి ఇంత గొప్ప మార్గంలోకి మనమంతా వచ్చాం. అవకాశం వున్నప్పుడల్లా కూర్చొని ధ్యానం చేస్తున్నాం. ఎందుకు అంటే జ్ఞానం కోసమే కష్టపడుతున్నాం. భీమవరంలో మూడు రోజుల క్లాస్‌లో రోజుకి 8 గంటలు, 10 గంటలు కూడా చేస్తున్నారు.

ఇప్పుడు ఇంకా ఎక్కువ చేస్తున్నారు. అలాగే మార్నింగ్ నాలుగు

గంటల నుంచి ఆరున్నర దాకా కంపల్సరీగా జూమ్‌లో జాయిన్ అవుతున్నారు. కానీ ఈ  భోజనం అనే దొంగ ఏం చేస్తాడంటే మీరు బాగా తింటే ధ్యానంలో కూర్చోగానే చక్కగా నిద్ర వస్తుంది.

ఇంక రేపు చేసుకుందాంలే అని శుభ్రంగా పడుకుంటారు. విచిత్రం ఏమిటంటే? ఎంత ఎక్కువ తింటే సాధన అంత తక్కువ చేస్తారు. అందుకే యోగులు మితంగా తినమంటారు. కడుపుని మూడు భాగాలు చేసి, రెండు భాగాలు భోజనంతో నింపి, ఒక భాగం ఖాళీగా ఉంచమంటారు. దాన్నే మితాహారం అంటారు.

అలాంటి వారికి ధ్యానంలో నిద్ర రాదు, శరీరం సహకరిస్తుంది, యాక్టివ్‌గా ఉంటారు, ఎంతసేపైనా కూర్చుంటారు, జ్ఞానాన్ని సంపాదించు కుంటారు. కానీ ఈ భోజనం అనే దొంగ అంటే భోజనం కొంచెం రుచిగా ఉంటే ఎక్కువ లాగిస్తారు, వెరైటీలు ఉంటే ఇంకా ఎక్కువ లాగిస్తారు. అలాంటి వారు ధ్యానంలో నిద్రపోతారు. అందువల్ల వారు సంపాదించు కోవలసిన జ్ఞానం సంపాదించుకోలేరు. అందుచేత  మన జ్ఞాన ధనం దోచుకోకుండా ఈ భోజనమనే దొంగ విషయంలోను కొంచెం జాగ్రత్తగా ఉండాలి.

రెండో దొంగ చేసే పని రాత్రి, వాడు నిద్ర దొంగ. చాలామంది తెల్లవారి పోయేదాకా లేవలేరు. కాని మార్నింగ్ జూమ్‌లో మనవాళ్ళు నాలుగు గంటలకే ఎంతోమంది జాయిన్ అవుతున్నారు. కానీ ఇంకా కొన్ని వందల మందికి, వేల మందికి జాయిన్ అవ్వాలని వుంది, జ్ఞానం సంపాదించుకోవాలని వుంది, గొప్పవాళ్ళు కావాలని వుంది, సమస్యల్లో నుంచి బయట పడాలని వుంది.

కానీ వారు సంపాదించుకోబోయే జ్ఞానాన్ని రాత్రి దొంగ దోచుకుంటున్నాడు. రాత్రి దొంగ జ్ఞానం సంపాదించుకోవడానికి వీలు లేకుండా చేస్తున్నాడు. ఎందుచేతనంటే ఎన్నో ఊళ్ళలో  జూమ్‌లోకి రమ్మంటే

నిద్ర లేవలేకపోతున్నామండి అని  అంటున్నారు.

అసలు ఆ నిద్ర అనే దొంగ లేకపోతే మన జూమ్ పట్టదండి. ఆ నిద్ర అనే దొంగ వుండడం వల్ల మనం బతికాం.  అందుచేత ఈ ఇద్దరి దొంగల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని చెప్పి మహమ్మద్ ప్రవక్త చెప్పాడు, ఎంత గొప్పవాడండి ఆయన.

ఈ యోగీశ్వరులు అపారమైన జ్ఞానం సంపాదించుకున్న వారు. వారు మనల్ని జ్ఞానం విషయంలో ఎన్నో రకాలుగా హెచ్చరిస్తూ వుంటారు మనం నష్టపోకూడదని. అందుచేత అటువంటి వారు చెప్పిన దాన్ని జాగ్రత్తగా ఆచరించే ప్రయత్నం చేయాలి.

మహమ్మద్ ప్రవక్త ఆఫ్రికా ఖండంలో ముస్లిం దేశాల్లో  ఖురాన్ ద్వారా బోధించాడు. అలాంటి జ్ఞాన సందేశాలే జీసస్ క్రైస్ట్ బైబిల్ ద్వారా వెస్టర్న్ కంట్రీస్ లో బోధించాడు. అలాగే శ్రీకృష్ణ భగవానుడు భారతదేశంలో భగవద్గీత ద్వారా బోధించాడు. బుద్ధుడు బౌద్ధులకు బోధించాడు. ఇలా ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క ప్రాంతంలో అలాంటి బోధలు చేశారు.

అజ్ఞానంలో ఉన్న వాళ్ళు వారు చెప్పింది అర్థం చేసుకోక, వారు వేరే మతం వాళ్ళు మనకు సంబంధం లేదు అనుకుంటారు. కానీ ఎవరు చెప్పినా సత్యమే చెప్తారు, అజ్ఞానం తొలగించుకొని, జ్ఞానం సంపాదించు కోమనే చెప్తారు. అందుచేత  మహమ్మద్ ప్రవక్త చెప్పిన ఈ ఇద్దరు దొంగల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.

అందుకే  పత్రి గారు సాత్వికమైన శాకాహారం తీసుకోమంటారు, మాంసాహారం వద్దంటారు, కోడిగుడ్లు వద్దంటారు, వెల్లుల్లి వద్దంటారు. అవి తీసుకున్నావంటే నీ జ్ఞానధనం పోతుంది అంటారు. నువ్వు కొద్దో గొప్పో సంపాదించుకున్న జ్ఞానం పోతుంది అంటారు. ఆహారం మిత్తంగా తీసుకోమంటారు. ఆహార విషయంలో చాలా జాగ్రత్తగా వుండమంటారు.

అలాగే రాత్రి మితంగా భోజనం చేయమంటారు, ఉదయాన్నే

లేవమంటారు. ధ్యానానికి, జ్ఞానానికి ఉదయం పూట కేటాయించుకోమంటారు. నిద్ర కూడా మితంగానే ఉండాలి అంటారు.

కాని కొంతమంది అన్ని గంటలు నిద్రపోతే గానీ లేవలేరు. వారు ధ్యానం ఏం చేస్తారు? జ్ఞానం ఏం పొందుతారు? చెప్పండి? ఏ లాభాలు పొందలేరు. చూడండి డబ్బు ఎవడైనా దోచుకుంటే వాడి పరిస్థితి ఏంటి చెప్పండి? అలాగే జ్ఞానధనం దోచేస్తే వాడి పరిస్థితి ఆలోచించండి. ఎందుచేతనంటే వాడు సంపాదించుకోవలసిన జ్ఞానాన్ని ఈ రాత్రి, పగలు దొంగల వల్ల సంపాదించుకోలేక పోతే అజ్ఞానంలోనే వుంటారు. ఎంతో దుఃఖపడుతూ వుంటారు, జీవితమంతా అశాంతితోటే వుంటారు.

అందుచేత గుర్తుపెట్టుకోండి ఈ ఇద్దరు దొంగల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాల్సిందే. నేను కర్ణాటకలో ఒక క్లాస్ చెప్పాను. అక్కడ ఆర్థిక స్థితి పెంచుకోవాలంటే ఎలా? అనే పుస్తకం చూపించి చెప్తున్నప్పుడు, డబ్బు పెంచుకోవాలనుకునే వాళ్ళు ఎంతమంది వున్నారు అని అడిగితే అందరూ చేతులెత్తారు. నాకు నవ్వొచ్చింది. ఆహా అందరికి డబ్బు కావాలన్న మాట అని అనుకున్నాను.

తర్వాత "మరణించక ముందే మరణించాలి" అన్న పుస్తకం గురించి చెప్పడం జరిగింది. మీరు చనిపోయాక ఏమవుతారో మీకు తెలుసుకోవాలని వుందా? అని అడిగాను. ఆ తెలుసుకోవాలని వుందండి అన్నారు. అయితే మీకు మధ్యాహ్నం నుంచి చెప్తాను అన్నాను. భోజనం అయ్యాక చెప్పాను.

నువ్వు ఎన్ని కోట్లు సంపాదించు, ఎన్ని వ్యాపారాలు చేయి, ఎంత డబ్బు ఉండనియ్యి నువ్వు చనిపోయినప్పుడు అవన్నీ ఇక్కడ వదిలిపెట్టేయాలి, ఒక్కటీ నీ కూడా రాదు. నీ బిల్డింగ్లు కానీ, నీ కార్లు కానీ, నీ భోగాలు కానీ, నీ పొలాలు కానీ ఏవీ నీ కూడా రావు. నువ్వు ఎన్ని కోట్లు ఎన్ని బ్యాంకుల్లో వేసుకున్నా ఎంత బంగారం సంపాదించినా అన్ని వదిలిపెట్టేయవలసిందే

అని చెప్పడం జరిగింది.

ఎవ్వరైనా ఏమీ లేకుండా వస్తారు, ఏమీ లేకుండా వెళ్తారు. నీకు వున్నవి, సంపాదించుకున్నవి ఒక్కటీ కూడా తీసుకువెళ్ళలేవు. అప్పుడు పైలోకాలనుంచి వీళ్ళని తీసుకు వెళ్ళడానికి ఇద్దరు సహాయకులు వస్తారు.

వాళ్ళు ఏం చేస్తారంటే? ఇక్కడ భూమిమీద పాపాలు చేసిన వాళ్ళని నరక లోకాలకి తీసుకు వెళ్తారు. ఈ భూమి మీద పుణ్యం చేసిన వాళ్ళని స్వర్గ లోకాలకు తీసుకు వెళ్తారు. స్వర్గంలో భోగాలు వుంటాయి. కానీ భూమి మీద జ్ఞానధనాన్ని సంపాదించుకున్న వాళ్ళని ఊర్ధ్వ లోకాలకి తీసుకు వెళతారు. వారు అంత గొప్పవాళ్ళు అవుతారు అని చెప్పాను.

ఆ రోజు క్లాస్‌లో నా ప్రక్కనే బాగా సంపాదించిన ఆయన వున్నాడు. అప్పుడు ఆయనతో అన్నాను, ఏమండీ ఇన్ని సంపాదించారు, చచ్చిపోతే ఏమన్నా మీరు పట్టుకెళ్తారా? అంటే ఏమీ లేదు అన్నారు. మరి మీరు చనిపోతే మీకు లాభించేది ఏది? అంటే జ్ఞానము అని ఆయన అంతట ఆయనే ఒప్పుకున్నాడు.

మరి ఆ జ్ఞానం ఏమన్నా ఇప్పటి దాకా సంపాదించారా? అంటే ఏమీ సంపాదించలేదు అన్నాడు. మరి దేనికండి ఇంత కష్టపడుతున్నారు? ఏం సాధించాలని అనుకుంటున్నారు? అన్నాను. అప్పుడు అందరికి అర్థమైంది. అప్పుడు మళ్ళీ అడిగాను ఇప్పుడు చెప్పండి డబ్బు ఎంతమందికి కావాలి? అంటే ఎవరూ చేతులెత్తలేదు.

అందుచేత జ్ఞాన ధనం యొక్క గొప్పతనం తెలుసుకోండి. ఆ ధనాన్ని ఎవరూ దోచుకోవడానికి అవకాశం ఇవ్వకండి.

అందుకే మహమ్మద్ ప్రవక్త ఈ ఇద్దరు దొంగల విషయంలో
మనల్ని జాగ్రత్తగా ఉండమని హెచ్చరించడం జరిగింది.

# ఇంకొక యోగీశ్వరుడు

**"ఊహలు ఆకాశంలో, చేతలు భూమి మీద"** ఇలా ఉందట మానవుల పరిస్థితి. అందుచేత **"ఊహించడం తగ్గించు, చేతలు పెంచు"** అన్నారు.

మనం గమనిస్తే సామాన్యులు, ఏ జ్ఞానం లేనివారు, సరైన అవగాహన లేని వారి ప్రవర్తన మామూలుగా వుండొచ్చు. కానీ ఇంత ధ్యాన సాధన చేస్తున్నా, ఇన్ని విషయాలు తెలుసుకుంటున్నా, ఇన్ని నేర్చుకుంటున్నా, ప్రవర్తన అలాగే వుంటే ఆలోచించవలసిందే.

అందుకే ఇది చాలా ముఖ్యమనే ఇప్పుడు చెప్పడం జరుగుతుంది. అంటే దీని అంతరార్థం ఏమిటంటే? మనం అన్నీ చెప్తున్నాం కాని ఆచరణ కనిపించట్లేదు. గొప్ప గొప్ప విషయాలు తెలుసుకుంటున్నాం, వ్రాసుకుంటున్నాం, కానీ ఆచరణ ఉండట్లేదు.

ఇంతకుముందు మనం ఏమని చెప్పుకున్నామంటే? **"ఆచరణాత్మకమైన సందేశాలే, వినేవాడిని ప్రభావితం చేస్తాయి అని".** అందుచేత చెప్పే వాటిని ఆచరించే ప్రయత్నం చేయాలి.

ప్రతి ఒక్కరిలో అంతరాత్మ ఉంది. అంతరంలోని ఆత్మే సాక్షాత్తు భగవంతుడు. ఆయన నీ ఆలోచనలు గమనిస్తున్నాడు, నీ మాటలు వింటున్నాడు, నీ చేతలన్నీ తెలుసుకుంటున్నాడు. ఆయనకేమీ తెలీదని అనుకోకూడదు.

నీ ప్రవర్తన తేడాగా ఉంటే ఆయన ఎలా హర్షిస్తాడు? ఎలా సహకరిస్తాడు? ఆయన సహకారం కావాలి అంటే ఆయన మెచ్చే విధంగా నువ్వు ప్రవర్తించాలి. కాని కబుర్లు, మాటలు కోటలు దాటుతాయి, చేతలు మటుకు భూమి నుంచి కదలవు. నీ మాటలు ఆకాశంలో, చేతలు భూమ్మీద ఉంటే ఎలా కుదురుతుంది?

అంతరంలోని ఆత్మ ఎలా ఒప్పుకుంటుంది? నా విషయంలో

ఒక సంఘటన చెప్తాను. నేను ఈ మార్గంలోకి వచ్చే ముందు పత్రిగారి పరిచయం కాకముందు వ్యాపారం చేసేవాడ్ని. ఒక్క వ్యాపారం కాదు, చాలా వ్యాపారాలు చేసేవాడ్ని. అప్పుడు నా ఆశయం, నా అభిప్రాయం సంపాదన. ఎంత సంపాదించాను అన్నదే చూసుకునేవాడిని, అంతేకాని ఎలా సంపాదిస్తున్నాను.. అన్న దాని గురించి ఆలోచించేవాడిని కాదు.

క్రిందటి సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఇన్ని లక్షలు పెరిగాయి అని సంబరపడేవాడ్ని. అప్పుడు ఏదో సేవ చేయాలని సంపాదించిన లక్షల్లో ఏదో కొన్ని వేలు సేవా కార్యక్రమాలకు ఉపయోగించేవాడిని.

కొండంత అవినీతి చేసి సంపాదించిన లక్షల నుంచి గోరంత సేవకు ఉపయోగించేవాడిని, గొప్పగా భావించేవాడిని. చూడండి కొద్ది పాటి పుణ్యం చేసి, కొండంత పాపం చేస్తే, నువ్వు లాభం పొందినట్టా? నష్టపోయినట్టా? అంటే నష్టపోయినట్టే కదా?

అలాంటి సమయంలోనే పత్రిగారి పరిచయం అయింది. ఎందుకో తెలీదు ఆయన సందేశాలు, ఆయన బోధలు, నన్ను బాగా ఆకర్షించాయి, అందుచేత ఆయన చెప్పే ధ్యానం చేసాను. ఈ ధ్యానం అందరికీ ఊరూరూ తిరిగి పంచడం కూడా మొదలుపెట్టాను.

మరి ఊరూరు తిరిగి క్లాసులు చెప్పేటప్పుడు పత్రి గారి దగ్గర నేర్చుకున్న నీతులు, ధర్మాలు అన్నీ చెప్పేవాడిని. అలా చెపుతూ గొప్పగా ఫీల్ అయ్యేవాడిని. కానీ తరువాత ఈ వ్యాపారంలో కూర్చుని నేను చేసే పనులు, నా మాటలు, నా ఆలోచనలు, నేను చెప్పేదానికి సంబంధం వుండేది కాదు. అక్కడేమో ఒకటి చెప్తున్నాను, వ్యాపారంలో చేసేది, మాట్లాడేది చాలా తేడాగా వుండేది. కాని అంతరంలో ఉన్న ఆత్మ నుంచి అనిపించేది, నువ్వు ఏం చెప్తున్నావు? ఇక్కడ ఏం చేస్తున్నావు? నువ్వు ఏమన్నా గమనించుకున్నావా? అని అంతరాత్మ హెచ్చరిక కూడా గ్రహించేవాడిని. అలా చేస్తున్నందుకు అంతరంలో బాధ కూడా కలిగేది. నాకు తర్వాత అర్థమైంది అది ఆత్మ ఘోష అని. ఆ ఘోష మెల్లిగా పెరిగింది.

వ్యాపారంలో ఏ రకంగా చూసినా అధర్మమే, అవినీతే, అక్రమమే, అన్యాయమే. నేను కూల్ డ్రింక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కూడా చేసేవాడిని. అందులో కూడా తెలివంతా ఉపయోగించి ఎన్నో మాయలు చేసేవాడ్ని.

సరిగ్గా ప్రిపేర్ చేస్తే మూడు నెలలు వస్తాయి, కానీ నెలలోనే డామేజ్ అయిపోయేవి. ఎంతో మంది డబ్బులు ఇచ్చి కొనుక్కొని, అలాంటివి త్రాగితే హాని జరగదా? ఆ పాప ఫలితం అనుభవించమా?

చివరికి ఫుడ్ డిపార్ట్మెంట్ వాళ్ళు శాంపిల్స్ తీసుకుని కేస్ పెట్టారు. ఫుడ్ కేసు చాలా తీవ్రంగా ఉంటుంది. అరెస్ట్ చేస్తారు, మూడు నెలలో, ఆరు నెలలో జైల్ శిక్ష కూడా పెడతారు. ఇంక చూడండి నాకు ఎంత టెన్షన్. ఇంత గొప్పోడ్ని, ఇన్ని కోట్లు సంపాదించినవాడ్ని, నేను అరెస్ట్ అయ్యి జైల్లో ఉంటే నా పరిస్థితి ఎలా ఉంటుంది?

అప్పుడు నాలో జరిగిన అంతర్మధనం, భాధ చెప్పలేను. ఆరు మాసాలో, ఎనిమిది మాసాలో కేస్ నడిచింది. ప్రతీ వాయిదాకి వెళ్ళాలి, పొద్దున్నే వెళ్ళి కూర్చుంటే సాయంత్రం బయటికి వచ్చేవాడ్ని. నాకు అనిపించేది ఇదేంటి నన్ను అరెస్ట్ చేయక్కర్లేదు, ఈ శిక్ష అంతకన్నా దారుణంగా ఉంది అనిపించేది. అప్పుడు అనుకునేవాడ్ని నేను చేసిన దాని ఫలితమే ఇది అని.

తరువాత కోర్టు ద్వారా రీ అనాలసిస్ కి పెట్టాను. ఢిల్లీ ల్యాబ్ లో ఆ శాంపిల్ కరెక్ట్ గా ఉందని డబ్బులు ఖర్చుపెట్టి రిపోర్ట్ తెప్పించాం, కేస్ కొట్టేసారు. అప్పుడు అనుకున్నాను మళ్ళ ఫుడ్ ప్రొడక్ట్స్ జోలికి వెళ్ళకూడదు, అలాంటి వ్యాపారాలు చేయకూడదు అని.

అలాగే ఫైనాన్స్ వ్యాపారంలో వాయిదాలు కట్టకపోతే వాళ్ళ మీద రౌడీల్ని పురమాయించి హెరాస్ చేసి వసూలు చేశాను. నిజాయితీగా, ధర్మంగా ఉంటే వసూలు చేయలేం. నా తెలివి తేట్లన్నీ ఉపయోగించి ఎన్నో వ్యాపారాలు చేశాను. ఎప్పుడయితే పత్రి గారి పరిచయమై ఇవన్నీ అధర్మమని తెలిసిన వెంటనే అన్ని వ్యాపారాలు మానేసాను.

నాకు ఉన్న డబ్బు బ్రతకడానికి చాలు. ఎందుకు ఆశ? ఎవరి కోసం? అని ఆలోచించాను! జీవితంలో ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. నేను అధర్మంగా సంపాదించింది కుటుంబంలోని వాళ్ళు అనుభవిస్తారు, కాని చేసిన పాపాలు నా కూడా వస్తాయి. ఈ పాపాలు పోగు చేయడానికా ఈ సంపాదన? అని తెలుసుకున్నాను.

మళ్ళీ ఆలోచించాను నేను డబ్బు సంపాదిస్తున్నానా? పాపాన్ని సంపాదిస్తున్నానా? అని. కాని చూస్తే పాపమే సంపాదిస్తున్నాను అని అర్థమైంది. ఇంక అప్పటినుంచి నా జీవితాన్ని ఎంతో మార్చుకున్నాను. సంపాదన అంటే ధర్మంగా సంపాదించాలి, ఉన్నంతలోనే బ్రతుకుదాం అనుకున్నాను.

అప్పుడు నా దగ్గర 5000 జీతం తీసుకునే వాడు బ్రతికేవాడు, ఇన్ని లక్షలు వుండి నేను బ్రతకలేనా? అనుకున్నాను. అప్పుడు పత్రిగారి లాంటి గురువు దొరికినందుకు చాలా సంతోషించాను. ఆయన అద్భుతమైన సందేశాలు ఇచ్చేవారు.

అవన్నీ అర్థం చేసుకున్నాను. ఆచరణలో పెట్టడం మొదలు పెట్టాను. అవే అందరికీ బోధించడం మొదలుపెట్టాను. అందుకే అప్పుడు ఎంత డబ్బు సంపాదిస్తున్నా శాంతి వుండేది కాదు. ఇప్పుడు సంపాదన లేకపోయినా ఎంతో శాంతిగా, ఆనందంగా జీవిస్తున్నాను.

అంతకు ముందు మేడం, నేను ఇద్దరూ గొడవలు పడేవాళ్ళం. ఒకళ్ళంటే ఒకళ్ళకి ఇష్టమే కానీ గొడవలే. ఒకటి, రెండు రోజులు ఎడమొహం పెడమొహంగా కూడా ఉండేవాళ్ళం. కానీ ఇప్పుడు ఎంతో అన్యోన్యంగా వుంటున్నాం, ఒకరికొకరు సహకరించుకున్నాం. ఈ మార్పు ఎందుకు వచ్చింది? ధర్మంగా జీవించడం వల్ల, ధర్మంగా సంపాదించడం వల్ల.

ఇప్పుడు మాకేమన్నా లోటా? ఏ విషయంలో మేము తక్కువగా ఉన్నాం చెప్పండి. అనుకున్న ప్రతీ పని మేము చేయగలుగుతున్నాం. మేము లగ్జరీలు చేయట్లేదు కానీ, చేయాలనుకున్న సేవలన్నీ చేస్తున్నాం.

అందుచేత యోగీశ్వరులు చెప్పే సందేశాలు సామాన్యమైనవి కావు. గుర్తుపెట్టుకోండి "ఊహలు ఆకాశంలో ఉండకూడదు, చేతలు భూమిమీద ఉండకూడదు". "నీ చేతలు ఆకాశంలో ఉండాలి, ఊహలు తగ్గించుకోవాలి", అంటే ఊహలు తగ్గించు, చేతలు పెంచు అని యోగీశ్వరులు అన్నారు.

యోగులు ఏది చెప్తారో అది చేయండి. మీరు ఏది చేయరో అది చెప్పడానికి సంకోచించండి. లేదంటే కనీసం చెప్పిన తరువాత నైనా ఆచరించే ప్రయత్నం చేయండి. ఊరికే నోటికి వచ్చింది చెప్పకండి. అంతరంలో ఉన్న ఆత్మ గమనిస్తుందని మర్చిపోకండి.

మీరు ఇచ్చే సందేశాలు ఎవరికీ తెలియదని అనుకుంటారు. కానీ మీ లోపల ఉన్న అంతరాత్మకు తెలుసని మర్చిపోకండి, అంతరాత్మను అనుసరించండి, దానికి తీవ్ర ధ్యాన సాధన చెయ్యండి, యోగుల సందేశాలు ఆచరించండి.

**"ఊహలు తగ్గించండి, చేతలు పెంచండి"**


## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

**a)** ప్రతిరోజూ ఉదయం **Zoom** లో **4 to 6.30 a.m. Silence Meditation** మరియు **6.30 to 7.30 a.m.** వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

**Zoom I.D. :2413823868, Password : RAO**

**b)** పై కార్యక్రమము **6.30 to 7.30 a.m.** వరకు **Youtube**లో కూడా **Live** ఇవ్వబడుతుంది.

**c)** ఎవరైతే **TVR & TRL Whatsapp** గ్రూపులో వుంటారో వారికి **Zoom Link & You Tube Links** మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా **save** చేసుకోవాలి.

**d)** తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే **www.tst.org.in Open** చేసిన తర్వాత **Join in Whatsapp group** లింక్ మీద నొక్కండి.

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) భగవంతుడంటే - రూ.130/-
5) సత్యమార్గం - రూ.160/-
6) ఆత్మ శాస్త్రం - రూ.130/-
7) ధ్యాన శాస్త్రం - రూ.130/-
8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం -రూ.160/-
9) ధ్యాన శక్తి - రూ.130/-
10) తెలుసుకోండి - రూ.130/-
11) జీవిత సూక్ష్మాలు - రూ.130/-
12) మరణించక ముందే మరణించాలి- రూ.130/-
13) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
14) గీతాసందేశం - రూ.120/-
15) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) కర్మ సిద్ధాంతం - రూ.80/-
18) ధ్యానమంటే ? - రూ.80/-
19) త్రివిధాలు - రూ.80/-
20) ఉత్తమ పురుషుడు - రూ.80/-
21) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
22) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
23) జ్ఞాన జ్యోతి - రూ.70/-
24) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
25) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
26) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
27) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
28) బుద్ధుని సందేశాలు - రూ.70/-
29) భూతదయే దైవత్వం - రూ.70/-
30) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
31) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
32) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
33) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
34) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
35) అతీంద్రియ శక్తులు - రూ.60/-
36) ఆలోచించండి - రూ.60/-
37) నిర్వాణ మార్గం - రూ.60/-
38) ధ్యానులకు సూచనలు - రూ.60/-
39) సంకల్పమంటే? - రూ.50/-
40) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
41) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
42) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.50/-
43) మహాత్ముల సందేశాలు - రూ.40/-
44) సత్యం - రూ.40/-
45) చక్రాలు - రూ.40/-
46) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
47) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
48) మౌన ధ్యానం - రూ.40/-
49) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/-
50) శాకాహారమే మానవాహారం - రూ.15/-

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి,
భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్:9440309812,



"ఆత్మను నిర్లక్ష్యం చేసినవారు, 'ఆత్మ హంతకులు' అవుతారు"

ఆత్మ హత్య అంటే ఎవరైనా తనకు తాను ఆత్మను శరీరంలో వుండడానికి వీలు లేకుండా శరీరాన్ని నాశనం చేస్తే దాన్ని ఆత్మహత్య అంటారు.

జీవితకాలం జీవించినా ఆత్మను పట్టించుకోనివాడు, ఆత్మ గురించి ఏమీ చేయనివాడు, ఆత్మ లాభం కోసం ఆలోచించనివాడు, అసలు ఆత్మ అనేది ఉందన్న సంగతి ఎరుగనివాడు, వాడు భూమిమీద ఎన్ని గొప్ప పనులు చేసినా, ఎన్ని సాధించినా వాడు 'ఆత్మ హంతకుడు' అవుతాడని యోగీశ్వరులు చెప్పడం జరిగింది.

ధన సంపాదనలో తృప్తి పడండి. జ్ఞాన సంపాదనలో తృప్తి లేకుండా సంపాదించండి. దానికి ముఖ్య కారణం ఈ దేహం మీరు కాదు, మీరు ఆత్మ ఇది అర్థం చేస్కోండి. జీవితకాలం జీవించినా ఆత్మకు కావలసిన పనులు చేయకపోతే వారు 'ఆత్మ హంతకులు' అవుతారని తెలుసుకోండి. ఆత్మకు నష్టం కలిగించకండి, ఆత్మను క్షోభ పెట్టకండి.

- బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు

రూ.70/-